



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 149 | ది.13-9-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 149 | Date : 13-9-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


# అమరావతి క్వాంటం బయో వ్యాలీకి జాతీయ గుర్తింపునివ్వాలి

- జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- డబులింజన్ ప్రభుత్వంతో వైద్యారోగ్య రంగానికి కొత్త ఊపు
- రూ.249 కోట్లతో 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను ప్రారంభించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి చంద్రబాబు

**వైద్యారోగ్య శాఖలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



**విజయవాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** వైద్యారోగ్య రంగంలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంజీవని అమలు చేయనున్నామని, వైద్యరంగంలో ఇది గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని చెప్పారు. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నామని తెలిపారు. అమరావతిలో ఏర్పాటు చేయబోతున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్రాన్ని సీఎం చంద్రబాబు కోరారు. శనివారం వైద్యారోగ్య శాఖకు చెందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటీలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, సీఎం చంద్రబాబు సందర్శించి.. కొత్తగా నిర్మించిన బ్లాక్, ల్యాబరేటరీని ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ కళా వేదికలో ఏర్పాటు చేసిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ గా లాంఛ్ చేశారు. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రంలో 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ సదుపాయాలతో పాటు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి కీలక వైద్య విభాగాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం మరింత చేరువ కానుంది. అత్యాధునిక వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను తగ్గించేలా ఈ సదుపాయాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

**డబులింజన్ సర్కారుతో అభివృద్ధి..** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెండింతలకుపైగా పెంచారని తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత భారతదేశానికి, ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు మందులు అందుతున్నాయని చెప్పారు. అభా కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఫార్మా రంగానికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. వంటశాలను ఫార్మసీగా... ఆహారాన్నే ఔషధంగా భావించాలని సూచించారు. ఈ మేరకు ఆరోగ్య పద్ధతులను మార్చుకోవాలని చెప్పారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి వాటిని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని, యోగాభ్యాసంతో ఎనర్జీ లెవల్స్ పెరుగుతాయని అన్నారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. జేపీ నడ్డా నాయకత్వంలో దేశంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్న నమ్మకం ఉందన్నారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కూడిన డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వల్లే ఇటువంటి అభివృద్ధి సాధ్యమవుతోందని చెప్పారు. వైద్యారోగ్య రంగంతో పాటు అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్: సీఎం రేవంత్ రెడ్డి

- గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి
- మండపాల నిర్వహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన
- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం



**హైదరాబాద్,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ఆ ఏడు దశల వెరిఫికేషన్ ఏమైంది?.. డీఎస్సీపై ప్రభుత్వాన్ని నిలదీసిన జగన్

- మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జగన్
- ఏడు దశల తనిఖీ అంటున్నా అక్రమాలు ఎలా జరిగాయని విమర్శ
- నకిలీ ఖోఖో సర్టిఫికెట్లు, జరగని క్రీడాపోటీల అంశాలను ప్రస్తావించిన వైనం
- నియామక ప్రక్రియపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్



**తాడేపల్లి,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** ఏపీ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ల పరిశీలనలో ప్రభుత్వం చెబుతున్న 'ఏడు దశల వెరిఫికేషన్' ప్రక్రియపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇన్ని దశల తనిఖీలు జరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ, అక్రమాలు వెలుగుచూడటాన్ని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం తేలికగా వ్యవహరిస్తోందని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. ఈ సందర్భంగా జగన్ కొన్ని నిర్దిష్ట ఘటనలను ఉటంకించారు. కొందరు విజేతల పేర్లు జాబితాలో గల్లంతవడం, కొన్ని సర్టిఫికెట్లు నకిలీవని స్వయంగా ఖోఖో క్రీడా సమాఖ్య అధికారులు చెప్పడం, ఒక అభ్యర్థి పేర్కొన్న క్రీడా ఈవెంట్‌ను తాము అసలు నిర్వహించలేదని నాగార్జున విశ్వవిద్యాలయం స్పష్టం చేయడం వంటి ఉదంతాలను ఆయన ప్రస్తావించారు. "ఇన్ని అక్రమాలు బయటపడుతుంటే, అసలు ఎక్కడ, ఏం వెరిఫికేషన్ చేశారు?" అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నా, డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం ఎలా చెప్పగలదని ఆయన ప్రశ్నించారు. ఈ లోపాలే అక్రమాలకు ఆస్కారం కల్పించాయా అని సందేహం వ్యక్తం చేశారు. జరిగిన తప్పులకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో నెలకొన్న పరిస్థితులపై సమగ్రమైన వివరణ ఇవ్వాలని ఆయన కోరారు. కాగా, మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే ఉంది. అయితే, నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయని, సర్టిఫికెట్ల పరిశీలన పలు దశల్లో పకడ్బందీగా నిర్వహించామని ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది. కొన్ని ఆరోపణలపై అధికారులు మీడియా సమావేశాల్లో వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ, తాజాగా జగన్ చేసిన వ్యాఖ్యలతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# కేరళంలోని త్రిప్రయార్ శ్రీరామస్వామిని దర్శించుకున్న పవన్ కల్యాణ్

- త్రిప్రయార్ ఆలయంలో దీపారాధన సేవలో పాల్గొన్న పవన్
- మీనుట్టు, వేది వజిపాడు కార్యక్రమాల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం
- సంధ్యాకాల అర్చనలను నిర్వహించిన పవన్





**విజయవాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేరళంలోని అత్యంత పురాతన, సుప్రసిద్ధ శ్రీరామ క్షేత్రమైన త్రిప్రయార్ శ్రీ రామస్వామి వారిని దర్శించుకున్నారు. ప్రస్తుతం ఆయుర్వేద చికిత్స నిమిత్తం కేరళంలో ఉన్న ఆయన... ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎంతో విశిష్టమైనదిగా భావించే 'దీపారాధన' సేవలో పవన్ పాల్గొన్నారు. ఒక్కరోజు దీపారాధన సేవకు విరాళం అందించారు. ఆలయ ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ మందిరంలోని ప్రధాన దీపాలను వెలిగించారు. ఆలయ సాంప్రదాయాలను పాటిస్తూ శ్రీరామస్వామి వారి సన్నిధిలో నిర్వహించే ప్రత్యేక ఆధ్యాత్మిక ఆచారాలైన 'మీనుట్టు' (చేపలకు ఆహారం అందించే సేవ), అలాగే 'వేది వజిపాడు' (బాణాసంచా కాల్చే సేవ) కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. శంఖుచక్రాలు, ధనుస్సు, రత్న హారాలతో ప్రకాశిస్తున్న శ్రీరామచంద్రుని దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని సంధ్యాకాల అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామస్వామివారితో పాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకృష్ణుడికి, అయ్యప్పస్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం మాలవిరాట్టుకి కుడివైపున ఉన్న శ్రీ దక్షిణామూర్తికి, నైరుతి మూలన ఉన్న వినాయకుడికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు, వేదాశీర్వచనాలు స్వీకరించారు. అంతకు ముందు పవన్ కు ఆలయ బోర్డు చైర్మన్, కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మరోవైపు, ఆలయం సమీపంలోనే పవన్ ఆయుర్వేద చికిత్స చేయించుకుంటున్నారు.

# అల్పపీడనం ఎఫెక్ట్..ఏపీలో నేడు, రేపు భారీ వర్షాలు

**విజయవాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో నెలకొన్న అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీని ఫలితంగా శని, ఆదివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ హై అలర్ట్ ప్రకటించింది. విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో, దక్షిణ కోస్తాలో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు.


In the Court of II Addl. Civil Judge ( junior division) at Vijayawada.

O.S No: 2455/2023

Between :-
UNION BANK OF INDIA, V W C C BRANCH, VIJAYAWADA.
Rep by its MANAGER.
.........Plaintiff

AND

K.Subbarao proprietor of M.M Enterprises.
........Defendant

To,
K. Subba Rao S/o Dharma Rao Hindu aged 41 years, prop., M.M. Enterprises, R/o D.No. 33-5-22, Papaiah Street, Seetahrampuram, Vijayawada 520012 ........... defendant

పై నెంబరు దావాలో వాది తనకు రావాలసిన బాకీ మొత్తం ను రాబట్టు కొనుటకు ప్రతివాది పై దావా దాఖలా చేసియున్నారు. సదరు ప్రతివాది కి ఎన్నిసార్లు కోర్టు వారు నోటీసులు పంపిన తీసుకొనకుండా త్రిప్పిపంపిన కారణంగా, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేస్తూ ,మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.14-10-2026 న వాయిదా వేసినారు. సదరు తేదిన ఉదయం గం॥ 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట పై ప్రతివాది హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేనియెడల మీ పరోక్షంగా తీర్మానం చేయగలరని తెలియజేయడమైనది.

(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 14-10-2026

ఇట్లు :-

P. Phanindra, Advocate,
Plot no :122, P&T Colony-2,
Vijayawada-10.
Cell Ph :9440772767


# జాతీయ లోక్ అదాలత్‌లో 43,519 కేసుల పరిష్కారం



**విజయవాడ లీగల్,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** విజయవాడ మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో శనివారం "జాతీయ లోక్ అదాలత్" నిర్వహించారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 43,519 కేసులు పరిష్కారమవ్వగా, పెండింగ్ కేసులకు సంబంధించి 20,09,42,805 రూపాయల పరిహారము పరిష్కారం జరిగింది. ఇందులో 70 మోటార్ యాక్సిడెంట్ కేసులకు పరిహారంగా రూ. 4,45,67,000, క్రిమినల్ కేసులు 43342కు సంబంధించి రూ.10,92,64,081 మరియు 156 ఇతర సివిల్ కేసులకు సంబంధించి రూ.8,86,48,695, ప్రీ లిటిగేషన్ కేసులు 20కిగాను పరిహారం గా రూ.30,30,029 అందజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 16 బెంచ్‌లు ఏర్పాటుచేయగా. అందులో ఒక న్యాయమూర్తి, ఒక న్యాయవాది, ఒక సామాజిక కార్యకర్త బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మరియు రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి యం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్ దిగ్విజయంగా జరగడానికి సహకరించిన న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, పోలీసు వారికి, ఇన్సురెన్సు కంపెనీ వారికి, కక్షిదారులకు, కోర్టు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

# సెప్టెంబర్ 21 వరకు ఎక్సైజ్ షాపుల రెన్యూవల్

- సెప్టెంబర్ 21 వరకు ఎక్సైజ్ షాపుల రెన్యూవల్
- 3,736 మద్యం షాపుల రెన్యూవల్‌కు షెడ్యూల్ ఖరారు
- సెప్టెంబర్ 30న రెన్యూవల్ కాని షాపులకు లాటరీ



**అమరావతి,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని 3,736 రిటైల్ మద్యం షాపుల రెన్యూవల్‌కు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. శనివారం నుంచి సెప్టెంబర్ 21 వరకు ఆరు పనిదినాల్లో ప్రస్తుత లైసెన్స్‌దారుల నుంచి రెన్యూవల్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సెప్టెంబర్ 22న కొత్త దరఖాస్తులకు గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించి, అదే రోజు నుంచి సెప్టెంబర్ 29 వరకు ఏడు పనిదినాల్లో కొత్త దరఖాస్తులు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 30న లాటరీ నిర్వహించనున్నారు. రెన్యూవల్‌కు సంబంధించిన గెజిట్ నంబర్లను సంబంధిత కలెక్టరేట్ల నుంచి ఎక్సైజ్ శాఖ ఇప్పటికే తీసుకుంది. శనివారం రెన్యూవల్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రచురించారు. మరో ఏడాది పాటు షాపులను కొనసాగించాలనుకునే ప్రస్తుత లైసెన్స్‌దారులు నిర్ణీత గడువులో రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో మొత్తం 3,736 రిటైల్ మద్యం షాపులు కొనసాగనున్నాయి. వీటిలో 3,396 షాపులు ఓపెన్ కేటగిరీలో, 340 షాపులు గీత కులాలకు రిజర్వ్ చేశారు. ప్రస్తుత లైసెన్స్‌దారులు రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోని షాపులు లేదా ఇతర కారణాలతో రెన్యూవల్ కాని షాపులను లాటరీ ద్వారా కొత్తగా కేటాయించనున్నారు. కొత్త షాపులకు దరఖాస్తు చేసుకునే వారు రూ.1,000 ప్రాసెసింగ్ ఫీజు, రూ. మూడు లక్షలు తిరిగి చెల్లించని దరఖాస్తు రుసుము జమ చేయవలసి ఉంది. లాటరీ నిర్వహించేందుకు కనీసం నాలుగు దరఖాస్తులు అవసరం అవుతాయని కమీషనర్ శ్రీధర్ పేర్కొన్నారు.

# నేషనల్ లోక్ అదాలత్ లో 18,140 కేసుల పరిష్కారం..




**నూజివీడు, సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** నూజివీడు గౌరవ కోర్ట్ కాంప్లెక్స్ లో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో 18,140 కేసులు పరిష్కారమైనట్లు నూజివీడు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు గౌరవ 15వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి డా. డి సత్యవతి గారు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పరిహార కేసులలో రూ. 2,10,41,160 అమౌంట్ సెటిల్మెంట్ జరిగిందని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో 18,000 పిట్టి కేసులు,140 అడ్మిషన్స్, 129 క్రిమినల్ కేసులు,50 సివిల్ కేసులు పరిష్కారమైనట్లు న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ లో కేసులు పరిష్కారం అయితే కోపతాపాలకతీతంగా ఇరు పార్టీలు గెలిచినట్లేనని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు బెంచులు ఏర్పాటు కాగా 15వ జిల్లా జడ్జి డా.డి. సత్యవతి గారు, సీనియర్ సివిల్ జడ్జి మిస్ జి.వాణి గారు, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి శ్రీమతి ఎమ్ శివ పార్వతి గారు, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఓ అనుష గారు, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కే శ్రావణి గారు వివిధ కేసులను పరిష్కరించగా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున న్యాయవాదులు, పోలీస్ వర్గాలు, కక్షిధారులు పాల్గొన్నారు.

## తెనాలి కవికి తెలంగాణ పోలీస్ శాఖ జాతీయ ప్రశంసా పత్రం



**తెనాలి,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఉమెన్స్ సేఫ్టీ వింగ్, సింబయాసిస్ లా స్కూల్ హైదరాబాద్ – లీగల్ ఎయిడ్ సెంటర్ సంయుక్తంగా "యునెస్" సహకారంతో నెల రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి "మహిళా సైబర్ భద్రతా మాసోత్సవాల" సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలో తెనాలికి చెందిన ప్రముఖ కవి, రచయిత డా.ఆళ్ళ నాగేశ్వరరావు ( కమల శ్రీ)లి ప్రశంసా పత్రం అందుకున్నారు. మహిళల సైబర్ భద్రతపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీలో డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ )రచన ఎంపికైంది. ఈ మేరకు సర్టిఫికేట్ ను నిర్వాహకులు ఆన్ లైన్ ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా స్థానిక కవులు, కళాకారులు డా. ఆళ్ళ ను అభినందించారు.

## ప్రభుత్వానికి ప్రజలకు వారధులు వారే

● సెలవ రోజులలో సైతం విధులలో!



**విస్సన్నపేట,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో రాబోయే ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్ లు వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత వేగవంతం చేసేందుకు సెలవు రోజులు సైతం ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు సారధ్యంలో మండల వ్యాప్తంగా గ్రామ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహించటం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రభుత్వ సేవలు అందించే అధికారులు సెలవు దినాలలో సైతం విధులు నిర్వహించటం వార్తా ప్రభ కంటపడింది. విస్సన్నపేట సచివాలయం 1 పరిధిలో ఇంటి పనులకు డిమాండ్ నోటీసులు రెండవ శనివారం సెలవు దినమైన 4వేల గృహాలకు సంబంధించి డిమాండ్లను ప్రింట్ తీసే ప్రక్రియను ఈవో హరికృష్ణ కుమార్ సారధ్యంలో నిర్వహించటం మరోవైపు సచివాలయ ఉద్యోగులు వికలాంగ వృద్ధాప్య వితంతు ఒంటరి మహిళ చేనేత గీత డప్పు కళాకారులు హెచ్ఐవి బాధితులు తల సేమియా వ్యాధిగ్రస్తులు పక్షవాత పీడితులు తదితరులకు కులం ఆదాయం ధృవీకరణ పత్రాల సర్టిఫికెట్లు అందించేందుకు సచివాలయ సిబ్బంది సైతం హాజరు కావడంతో పని రోజులలో విధులు నిర్వహించినట్లుగానే ప్రజలు రాకపోకలు అత్యధికంగా ఉండటం జరిగింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏవో ప్రసాద్, అదే సమయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులు పింఛన్దారులకు సేవలు అందిస్తున్నారు.

## సైబర్ క్రైమ్స్ కు మోసపోవద్దు అన్న డీసీపీ లక్ష్మీనారాయణ







**విస్సన్నపేట,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కొండ పర్వ ఎస్టి గురుకుల పాఠశాల నరసాపురం ఎస్సీ గురుకుల పాఠశాలలలో డీసీపీ లక్ష్మీనారాయణ సైబర్ క్రైమ్ సైబర్ ఫ్రాడ్స్ క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ చైల్డ్ మ్యారేజెస్ తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీపి రామచంద్రారావు, సిఐ గురు ప్రకాష్, ఎస్ఐ అర్జున రాజు నరసాపురం గ్రామ పెద్ద టిడిపి సీనియర్ నాయకులు ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల తదితరులు పాల్గొన్నారు పోలీసు అధికారులను గురుకుల పాఠశాల స్థలదాత సుబ్రహ్మణ్యేశ్వర రావు సన్మానించగా పోలీసు అధికారులు తిరిగి ఆయనను సన్మానించారు.

## పరిశుభ్రతకు పెద్దపీట.. పచ్చదనానికి ప్రాధాన్యం



**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్‌లో పచ్చదనం--పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ సెంటర్ డివైడర్‌లోని గ్రీనరీని మరింత అభివృద్ధి చేసే పనులు చేపట్టారు. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ఈ పనులు కొనసాగుతున్నాయి. సెంటర్ డివైడర్‌లో మొక్కలను సంరక్షించడంతో పాటు పచ్చదనం పెంపొందించేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై గ్రీనరీని అభివృద్ధి చేయడం ద్వారా పరిసరాలు ఆహ్లాదకరంగా మారడంతో పాటు హనుమాన్ జంక్షన్‌కు మరింత సుందర రూపం వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, మొక్కలను పరిరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని కార్యక్రమ నిర్వాహకులు కోరారు. అభివృద్ధి పనులను టీడీపీ టౌన్ పార్టీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సురేష్ పర్యవేక్షించారు.

## తిరువూరు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే

● ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. విద్యార్థులకు అండగా నిలుస్తూ..

● మరో పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా కొలకపూడి శ్రీనివాసరావుని చూడాలన్నది ప్రజల ఆకాంక్ష



**తిరువూరు,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గానికి గతంలో పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులుగా పనిచేసినప్పటికీ ఆశించిన స్థాయిలో నియోజకవర్గ అభివృద్ధి జరగలేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. అయితే తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా నియోజకవర్గంలోని గ్రామాలను విస్తృతంగా పర్యటిస్తూ, ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారులు, తాగునీరు, విద్య, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొంటున్నారు.

**విద్యార్థులకు ఆర్థిక భరోసా..** విద్యాభివృద్ధికి కూడా ఎమ్మెల్యే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరమయ్యే పరిస్థితి రాకుండా పలువురు విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారని, దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆయనపై ప్రత్యేక అభిమానం ఏర్పడిందని చెబుతున్నారు. ప్రజా సేవతో పాటు విద్యకు ప్రోత్సాహం అందిస్తూ విద్యావేత్తగా కూడా మంచి పేరు సంపాదించుకున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**పార్టీలో మహావృక్షంగా ఎదుగుతూ..** తెలుగుదేశం పార్టీలో తనకంటూ ప్రత్యేక గ గుర్తింపు అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి దృష్టికి నియోజకవర్గ ప్రతి సమస్యను తీసుకెళ్లి అభివృద్ధికి సహకరించాలని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు ప్రజల హృదయాలలో చెరగని తరగని మారని మర్చిపోని ముద్ర వేసుకున్నారని ఇటు పార్టీ వర్గాల్లో అటు ప్రజల్లో చర్చ కొనసాగుతోంది

## టైలాండ్ భూములకు సాగునీరు అందించండి

● ఇప్పటికే ఎకరాకు 20 వేలు పైనే ఖర్చు ●లబోదిబో మంటున్న రామరాజు ఛానల్ ఆయకట్టు రైతులు



**పెడన,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** పంట కాలువల శివారు భూములకు సాగునీరు అంధక రైతులు లబోదిబోమంటున్నారు. ఎల్ నినో ప్రభావం చేత ఈ సీజన్లో సాగునీరు ఇవ్వలేమని ఇవ్వలేమని ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే అయితే అప్పటికే రైతులు వ్యవసాయ సాగుకు సన్నద్ధమయ్యారు. ఈ ప్రాంతంలో ప్రధానంగా రామరాజు కాలువ పరిధిలోని ఆయకట్టు భూములు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. జింజేరు అచ్చయ్య వారి పాలెం కాకర్లమూడి నందమూరు మడక బల్లిపర్రు గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు కనీసం శివారు భూములు కైనా సాగును ఇవ్వాలని కోరుతున్నారు. మంగినపూడి బుద్ధాల పాలెం పొట్లపాలెం కానూరు తాళ్లపాలెం తదితర ప్రాంత రైతులు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. దుక్కి విత్తనాలు కలుపు మందు లాంటి అవసరాలకు ఇప్పటికే దాదాపు ఎకరానికి 20 వేల రూపాయలు ఖర్చు పెట్టారు. కనీసం పంచాయితీ చెరువులకు కూడా నీరు పెట్టలేని దుస్థితి ఏర్పడింది అని జింజేరు ప్రాంత ప్రముఖ రైతు తాత బ్రహ్మ విష్ణు ఉమామహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ పోలీసు శాఖ ప్రయత్నించినప్పటికీ కూడా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు సాగునీరు విడుదల చేయాలని ఆయన కోరారు.

## అంగరంగ వైభవంగా శ్రీ సిద్ధార్థ విఘ్నేశ్వర పూజలు





**విస్సన్నపేట,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** స్థానిక శ్రీ సిద్ధార్థ విద్యా సంస్థల ప్రధాన క్యాంపస్ నందు ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా వినాయక చవితి పండుగ సంబరాలను సంస్థ అధినేత మేడా మోహనరావు ఆయన సతీమణి నిర్మల మోహనరావు మరియు శ్రీ సిద్ధార్థ కుటుంబ సభ్యులు నిర్వహించారు. వేద పండితుల నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో ఉషోదయ వేళలలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు మరియు సిబ్బంది సహాయ సహకారాలతో మట్టి గణపతికి ప్రాణ ప్రతిష్ట షోడశోపచార పూజలు పాల ఉత్తరేణి తంగేడు ఉసిరి మారేడు వెలగ బొద్ది పువ్వులు మొక్కజొన్న తదితర 21 రకాల పత్రితో శ్రీ సిద్ధార్థ యాజమాన్యం టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థిని విద్యార్థులు బస్సు డ్రైవర్లు తదితరులుచే సామూహిక అష్టోత్తరం పూజా కార్యక్రమాలతో పాటు ఉండ్రాళ్ళు కుడుములు మోదకాలతో మహా నైవేద్యం బొజ్జ గణపయ్యకు అందించారు. సుదీర్ఘకాలంగా శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థలు పర్యావరణహిత మట్టి వినాయకులకే ప్రధాన ఇవ్వడమే కాకుండా ప్రతి పండుగకు ప్రతి ఒక్కరిని మిళితం చేయటం విద్యార్థిని విద్యార్థులకు పండుగల విశిష్టత దేశ నాయకులు మహాత్మా గాంధీ జవహర్ లాల్ నెహ్రూ సంఘసంస్కర్తలు కందుకూరి వీరేశలింగం పంతులు రాజా రామ్మోహన్ రాయ్ వారితోపాటు శ్రీనివాస రామానుజన్ తదితరుల జయంతి ఉత్సవాలు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పించడం జరుగుతుంది అని సంస్థ అధినేత మేడ మోహన రావు తెలియజేశారు. తాము తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం బోధిస్తున్న భారతీయ నాగరికత సంస్కృతి సాంప్రదాయాలను హిందూ ముస్లిం క్రిస్టియన్ అనే బేధం లేకుండా అన్ని పండగలకు అందరిని మిళితం చేస్తూ అవగాహన కల్పించడం 30 సంవత్సరాలుగా జరుగుతుందన్నారు. శ్రీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన పూజా కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు శ్రీహర్ష, దీప్తి ప్రిన్సిపాల్ రమణకుమార్, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## తాతయ్యలు, నాన్నమ్మ, అమ్మమ్మలతో ఆదిత్య స్కూల్‌లో సందడే సందడి

● ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు






**అమలాపురం,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** స్థానిక ఆదిత్య స్కూల్ కామనగరువు ప్రాంగణంలో గ్రాండ్‌పేరెంట్స్ డే వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో తాతయ్యలు, అమ్మమ్మలు, నాయనమ్మలు హాజరై సందడి చేయడంతో పాఠశాల ప్రాంగణం పెద్ద సంయుక్త కుటుంబాన్ని తలపించింది. వేడుకల్లో భాగంగా పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు సాంప్రదాయ పద్ధతిలో పెద్దలకు పాదపూజ చేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ బి. రామప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా గ్రాండ్‌పేరెంట్స్‌ను ఘనంగా సన్మానించారు. హాజరైన వారిలో అత్యంత వృద్ధులైన దంపతులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. తాతయ్యలు, మనవళ్ల అనుబంధాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన సరదా ఆటల్లో గ్రాండ్‌పేరెంట్స్ ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి. రామప్రసాద్ మాట్లాడుతూ.. "గ్రాండ్‌పేరెంట్స్ కుటుంబానికి బలమైన వేళ్లవంటివారని . వారు అనుభవాల నిధులని . కష్టపడే తత్వం, ఓర్పు, క్రమశిక్షణ, కుటుంబ విలువలను తమ జీవితాల ద్వారా నేర్పించారు. నేటి బిజీ ప్రపంచంలో పిల్లలకు ఆత్మీయతను, జీవన విలువలను అందిస్తున్నది ఈ తరమే. పాత తరం ఆలోచనలకు, కొత్త తరం ఆశయాలకు మధ్య వారధిగా తాతయ్యలు, అమ్మమ్మలు నిలుస్తున్నారు" అన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతులు పొందిన వారిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్. శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్. శృతిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి సుధ, ఆదిత్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు అభినందించారు.

## విద్యా సేవకు అరుదైన గౌరవం.. షబ్బీర్ హుస్సేన్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**కాకినాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** చేయూత చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో 9వ వార్షికోత్సవ వేడుకలు, టీచర్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సత్కరించారు. ఈ క్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు షబ్బీర్ హుస్సేన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయనకు ఆర్జేడీ జి. నాగమణి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, విద్యారంగానికి షబ్బీర్ హుస్సేన్ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో చేయూత చారిటబుల్ సొసైటీ చైర్మన్, ఫౌండర్ డా. ఎం. రవికుమార్, సెక్రటరీ చింతా నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు



**కృత్తివెన్ను,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి మెయిన్ సెంటర్‌లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వినాయక చవితి సందర్భంగా ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు భక్తులకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి వినాయక ప్రతిమలను భక్తులు స్వీకరించి పూజలు నిర్వహించాలని కోరారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## దళితవాడలో వినాయక మట్టి విగ్రహాల పంపిణీ....



**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** మండలంలోని కౌతవరం చిన దళితవాడలో ప్రముఖ సినీ నిర్మాత చల్లపల్లి అమర్ ప్రసాద్ వితరణతో మట్టి వినాయక విగ్రహాలను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని అన్ని గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను అందించి... సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాలని అమర్ ప్రసాద్ కోరారు. అమర్ ప్రసాద్ ఆర్థిక సాయంతో వందలాది మందికి ఈ విగ్రహాలను ఇవ్వటం వల్ల పర్యావరణానికి మేలు చేకూరుతుందని స్థానిక రామాలయ కమిటీ చైర్మన్ మద్దాల జగన్ పేర్కొన్నారు.

## శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో భక్తకోటి రద్దీ...





**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామి వారిని దర్శించుకునేందుకు శనివారం భక్తజనం బారులు తీరటంతో ఆలయ ప్రాంగణమంతా రద్దీగా మారింది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన వేలాది మంది భక్తులకు భారీ అన్న సమారాధనను నిర్వ హించారు. ఈ కార్యక్రమాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తెలిపారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితు లు చేపట్టారు. స్వామివారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

## కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పై పేక్ ప్రచారం మానుకోండి - పిన్నెంటి




**కృత్తివెన్ను,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** అధికారంలో ఉన్న అయిదేళ్లు ప్రజల సొమ్ము కోట్లాది రూపాయలు తాడేపల్లి ఆఫీస్ లో ఎగ్ పప్ ల రూపంలో తీనేసి, తాడేపల్లి కొంపలో ఎలుకలు తరిమెయ్యడానికి అంటూ కోట్లాది రూపాయలు బిల్లులు పెట్టుకుని, అధికారంలో ఉండగా తన మంత్రులతో తమ శాఖల గురించి ఒక్క ప్రెస్ మీట్ పెట్టకుండా అన్నింటికీ సకల శాఖ మంత్రి పిజ్జా ల తో మాట్లాడించి భవ్యంధ్ర కోసం మూడు పంటలు పండే తమ బంగారు భూములు ఇచ్చిన రాజధాని రైతులకూ గద్దె నెక్కిన దగ్గరి నుండి 5 ఏళ్ళపాటు కళ్ల వెంబడి రక్తం ధారలుగా కార్చేలా చేసి రాజధాని రైతుల ఉసురు, తల్లి, చెల్లెళ్ళ ఉసురు పోసుకుని 151 సీట్ల నుండి 11 సీట్లకు పడిపోయి సొంత నియోజకవర్గంలో కూడా గంట ఉండలేక బెంగుళూరు పారిపోయిన 11 రెడ్డి మాటలు విని, బీజ్జల రాసిచ్చే స్క్రిప్ట్ వాట్సాప్, పేస్ బుక్, ఇంస్టా గ్రూపుల్లో పెట్టి శునకానందం పొందుతూ, గొడ్డలి పార్టీ పెటియం సొమ్ముతో జల్సా చేస్తూ, తేడా వస్తే కులం ముసుగులో దాక్కుందాం అనుకుంటున్నా పెటియం కుక్కలకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని, ఇది నయా జమానా అని పేటియం కుక్కలను ఇళ్లకు వెళ్లి మరి పందుల్ని కుళ్ళ బోడిచినట్టు కుళ్ళ బోడిచి , జైల్లో చిప్పకూడు తినిపిస్తామని, ఒక్కొక్కడికి గన్నవరం వంశీ గాడి మాదిరి ఒక్క సారిగా నల్ల బొచ్చు, తెల్ల బొచ్చు అవుతుంది అని కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య అన్నారు. 5 ఏళ్ళు అధికారంలో ఉండగా ఒక్కటి అంటే ఒక్క టీచర్ పోస్ట్ భర్తీ చెయ్యని గొడ్డలి పార్టీ, చదువులు చెప్పే గురువులను మాత్రం తమ వైన్ షాపుల ముందు కాపాలా పెట్టింది అని దీనిని ఆత్మాభిమానం కలిగిన ప్రతి ఉపాధ్యాయులు గుర్తు పెట్టుకున్నారు అని, యిప్పుడు కూటమి ప్రభుత్వం మెగా డి ఎస్ స్సి ద్వారా 16000 పై చిలుకు పోస్టులు విద్యా శాఖలో భర్తీ చేస్తే 10 క్లాస్ పేపర్స్ లీక్ చేసిన ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ కోడి కత్తి రెడ్డి ప్రెస్ మీట్ లు పెట్టి మెగా డి ఎస్ స్సి లో అవినీతి అక్రమాలు జరిగాయాని దొంగ డ్రామాలు చేస్తుంటే వాటిని ఈ గొడ్డలి పార్టీ నాయకులు, పేటియం కూలీలు సోషల్ మీడియా పోస్టులు పెట్టి శునకానందం పొందుతున్నారని, భారతదేశ రాజ్యాంగ నిర్మాత, అందరికి ఆదర్శప్రాయులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అట్టడుగు వర్గాల వారికి అన్ని ప్రయోజనాలు అందాలని ఎంతో గొప్ప సంకల్పంతో తెచ్చిన రిజర్వేషన్ లు అడ్డు పెట్టుకుని కులాల ముసుగులో కొంతమంది గొడ్డలి పార్టీఅ సైకోలు గంజాయి బ్యాచ్ పెటియం బ్యాచ్ కూటమి ప్రభుత్వం పై ఇష్టం వచ్చినట్టు ఫక్ ప్రచారం అనే బురదను సోషల్ మీడియా వేదికగా వేస్తున్నారు అని వాళ్ళు అందరు తెలుసుకోవాల్సింది 11 రెడ్డి ని నమ్ముకుని ఎంతోమంది ఐఏఎస్, ఐ పి ఎస్ అధికారులే ఊచలు లెక్కపెట్టి, జైలు కుడు తిన్నారని, 5 రూపాయలు పెటియం ముష్టి కోసం పిచ్చి పిచ్చి పోస్టులు పెడితే మీకు కూడా వాళ్లకు పట్టిన గతి పడుతుంది అని, నేరస్తులకు, కులం, మతం, ప్రాంతం న్యాయ వ్యవస్థ చూడదు అని చేసిన తప్పులకు శిక్ష కచ్చితంగా ఉంటుంది అని, తన కోసం 3500 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన చెల్లెలు నే అవసరం తీరాక బండ బూతులు తిట్టి, కొట్టి బయటకు నెట్టిన చరిత్ర 11 రెడ్డి సొంతం అని, సొంత తల్లి వ్యక్తి గత జీవితం గురించి పోస్టులు పెట్టించిన ఘనుడు, చిన్నప్పటి నుంచి భుజాల మీదా పెంచిన బాబాయ్ ని బాత్రూంలో గొడ్డలి బలి చేసిన వాడు మిమ్మల్ని రక్షిస్తాడు అనుకోవద్దు అని మీకు ఆ ప్రశ్న రావణ్ గాడికి పట్టిన గతి పట్టకముందే యిప్పటికైనా కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు అందిపుచ్చుకుని సమాజంలో మంచిగా బ్రతకాలని లేదంటే శ్రీ కృష్ణా జన్మ స్థానానికి వెళ్లడం ఖాయమని అన్నారు కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య శనివారం అన్నారు ......ఒక ప్రకటన విడుదల చేశారు

## 90 వసంతాలు పూర్తి చేసుకొన్న జి అప్పల స్వామికి ఘన సత్కారం



**మల్కాజిగిరి సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి):** రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంఘం సఫీల్ గూడలో జరిగిన సమావేశం లో సూపర్ సీనియర్ సిటిజెన్ 90 వసంతాలు పూర్తి చేసుకొన్న జి అప్పల స్వామి ఎలక్ట్రికల్ బ్రాంచ్. సినిమా, డ్రామా ఆర్టిస్ట్ ను తనతో పాటు 30 ఏళ్ళు కలిసి పని చేసిన జెడ్ ఆర్ యూ సీ సీ మెంబర్ నూర్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు నారాయణ, సాయిబాబా తదితరులు శనివారం ఘనంగా సన్మానం చేసారు.

## మట్టి వినాయకులను పంపిణీ చేసిన నియో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ):**నల్లగండ్ల డివిజన్ ఎన్టీఆర్ నగర్ సోఫా కాలనీలోని నియో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్,రాజు నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు.విద్యార్థులు, ప్రజలు మట్టి వినాయకులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

## మట్టి వినాయకుడితో సెల్ఫీ వీడియో పోటీలు - లక్కీడ్రా



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ):**పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల రాఘవరావు,మిరియాల ప్రీతమ్ ఆధ్వర్యంలో 'సెల్ఫీ వీడియో విత్ మట్టి వినాయకుడు'కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.సెప్టెంబర్ 14 నుంచి 22 వరకు మట్టి వినాయకుడితో సెల్ఫీ వీడియో పంపించిన వారికి 26న లక్కీడ్రా నిర్వహించనున్నారు.తొలి మూడు బహుమతులుగా రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు అందజేయనున్నారు. మరో 10 మందికి ప్రెషర్ కుక్కర్లు బహుమతిగా ఇవ్వనున్నారు.ఈ కార్యక్రమంలో మిరియాల రాఘవరావు, శ్రవణ్ పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణ సందేశంతో సీడ్ గణపతి విగ్రహాలు

**- పోలీస్ కమిషనర్ కు సీడ్ గణపతి విగ్రహాన్ని అందజేసిన బి.ఆర్.ఎస్.నేత చిర్రా రవీంద్ర యాదవ్**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ):** పర్యావరణ పరిరక్షణ సందేశంతో రూపొందించిన సీడ్ గణపతి విగ్రహాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్‌కు అందజేశారు. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచే ఇలాంటి కార్యక్రమాలు అవసరమని కమిషనర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో చిర్రా రవీందర్ యాదవ్‌తో పాటు ఉద్యమకారులు మిద్దెల మల్లారెడ్డి, గంగారం సంగారెడ్డి, మాజిద్, సందీప్ రెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్: సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపియన్ డే కార్యక్రమంలో భాగంగా మెదక్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నేడు కుల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామం, పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, ఓటర్ల జాబితా పరిశీలన, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# ప్రతీ విగ్రహం స్టేడియం గ్రౌండ్ కు వచ్చేలా చర్యలు తీసుకోండి

**● నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోండి ● గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ అధ్యక్షులు యెర్రా కామేష్**

**భద్రాద్రి కొత్తగూడం సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం: గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిమజ్జన కమిటీ అధ్యక్షులు,న్యాయవాది యెర్రా కామేష్ విజ్ఞప్తి చేశారు.శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత పవిత్ర గోదావరి నదిలో ఎక్కువ సంఖ్యలో విగ్రహాల నిమజ్జనం కార్యక్రమం జరుగుతుందని గుర్తు చేశారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో గణపతి విగ్రహాలు పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనానికి తరలి వెళ్తాయని తెలిపారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదే విధంగా జిల్లా కేంద్రంలో చుట్టుపక్కల ప్రాంతాల్లో గణపతి ప్రతిమలను ఏర్పాటు చేసిన వారు సాధ్యమైనంత తొందరగా ప్రకాశం స్టేడియం గ్రౌండ్ కు చేరుకునేలా ముందస్తు ప్రణాళికను రూపొందించుకోవాలని కోరారు.గతంలో స్థానిక ప్రకాశం స్టేడియం వచ్చిన తర్వాతే నిమజ్జనానికి వెళ్లే విధంగా రూట్ మ్యాప్ ఉండేదని గుర్తు చేశారు కాలక్రమేనా ఈ విధానానికి స్వస్తి పలకడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు.గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని 25వ తేదీన జరిగే గణపతి శోభాయాత్రను ప్రకాశం స్టేడియం గ్రౌండ్ నుంచి అనుమతించాలని ఆవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులకు,పోలీసు యంత్రాంగానికి,ఉత్సవ కమిటీ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న తరుణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు మొదలవడం శుభసూచకమని అన్నారు.గణపతి నిమజ్జన శోభాయాత్ర ముగిసేవరకూ బెల్టు షాపులను ఓపెన్ చెయ్యకుండా ఎక్సైజ్,పోలీసు శాఖ వారు చర్యలు తీసుకోవాలని,వారికి మద్యం షాపు యజమానులు సహకరించాలని కోరారు.నిమజ్జన శోభాయాత్రను ప్రకాశం స్టేడియం



గ్రౌండ్ లో ఒంటిగంటకు పూజ చేసి ప్రారంభించడం జరుగుతుందని ఈలోగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు తమ తమ ప్రతిమలతో ప్రకాశం స్టేడియం గ్రౌండ్ కు చేరుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు ఒంటిగంట నుంచే గణపతి శోభాయాత్రను ప్రారంభించడం ద్వారా పవిత్ర భద్రాద్రి గోదావరి నదిలో నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేందుకు సహకరించిన వారమవుతామని తెలిపారు గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల తో ముడిపడి ఉన్నదని ఈ విషయాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు,భక్తులు గమనించాలన్నారు టపాసులు పేలుస్తూ,పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ డీజే బాక్సులతో ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా సాంప్రదాయ వాయిద్యాలతో భక్తి భావంతో ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఏ.లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి దారా రమేష్,వందనపు శ్రీధర్,అకిరెడ్డి మహేష్,మెరుగు చింటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

# గౌతమ్ నగర్‌పై 'హస్తం' గురి..

## మైనంపల్లి మాస్టర్ ప్లాన్!

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మల్కాజిగిరి మున్సిపల్ సర్కిల్ పరిధిలోని గౌతమ్ నగర్ డివిజన్‌పై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. రానున్న కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డివిజన్‌లో పార్టీ బలోపేతంపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. గౌతమ్ నగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.ఇందులో భాగంగా డివిజన్‌లో వివిధ రంగాల్లో ప్రభావం ఉన్న నాయకులు,వ్యాపారవేత్తలు, సీనియర్ నేతలతో మంతనాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. మైనంపల్లి ఆధ్వర్యంలో గౌతమ్ నగర్‌కు చెందిన ఠాగూర్ అరుణ్ సింగ్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది

**'అవకాశమిస్తే గెలిచి కానుకగా ఇస్తా'** కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పిస్తే గౌతమ్ నగర్ డివిజన్ నుంచి పోటీ చేసి విజయం సాధించి, ఆ విజయాన్ని మైనంపల్లి హనుమంతరావుకు కానుకగా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఠాగూర్ అరుణ్ సింగ్ తన సన్నిహితుల వద్ద పేర్కొన్నట్లు సమాచారం. దీంతో గౌతమ్ నగర్‌లో రాబోయే ఎన్నికలపై రాజకీయ ఆసక్తి మరింత పెరిగింది.

**కాంగ్రెస్ పాలనపై ప్రశంసలు** మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన సన్నిహితుల సమావేశంలో అరుణ్ సింగ్ కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ప్రశంసలు కురిపించినట్లు తెలిసింది.



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. మల్కాజిగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పలు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మైనంపల్లి హనుమంతరావు విశేషంగా కృషి చేశారని అరుణ్ సింగ్ పేర్కొన్నట్లు తెలిసింది. గౌతమ్ నగర్, మిర్జాల్‌గూడ డివిజన్ల పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం.

# మీ స్వార్థ రాజకీయాలతో సభా సమయాన్ని వృథా చేశారు

**● అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌వ్యవహార శైలిలపై శనివారం జూబ్లీహిల్స్ లో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి ఫైర్ ● వచ్చిన అవకాశాన్ని సద్వినియోగంచేసుకోక ప్రతిపక్ష బీఆరెస్, ఎక్కడ సమాధానం చేయాల్సి వస్తుందోనని కాంగ్రెస్ తప్పించుకున్నాయి ● ఈ కుట్రలను ప్రజాక్షేత్రంలో బీజేపీ తరపున ఎండగడతాం - బీజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ కీర్తిరెడ్డి ఆగ్రహం**



**హైదరాబాద్ సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి):** తెలంగాణ అసెంబ్లీ విలువైన సమయాన్ని తమ స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వృథా చేశాయని మండిపడ్డారు బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్ష బీఆర్ఎస్ తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేదన్నారు. ఇదే సమయంలో ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందోననే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కీలక అంశాలపై చర్చకు దూరంగా వెళ్లిందని ఆరోపించారామె.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే** "తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనన్న కీర్తిరెడ్డి. ఒకరు అధికారంలో ఉండి ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే.. మరొకరు ప్రతిపక్షంలో ఉండి ప్రజల తరఫున ప్రశ్నించాల్సిన బాధ్యతను మరిచిపోయారని మండిపడ్డారు. ఈ రెండు పార్టీల చిల్లర రాజకీయాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు" అని కీర్తిరెడ్డి ఎద్దేవా చేశారు.

**సమస్యలపై చర్చకు సమయం లేదా?** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయ్యాయంటూ సంబరాలు చేసుకోవడం కంటే, ఈ కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. అంతేకాదురాష్ట్రంలోని జీవో నెం.97తో పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఎన్నికల హామీల అమలు, 22ఏ నిషేధిత భూముల జాబితా వంటి కీలక అంశాలపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యలపై వేలాది మంది విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, భూముల యజమానులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమయంలో.. అసెంబ్లీ వేదికగా వాటిపై చర్చించకుండా రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకే సమయం కేటాయించడం దురదృష్టకరమన్నారు. "ప్రజల సమస్యలపై మాట్లాడటానికి అసెంబ్లీలో సమయం లేదా? రాజకీయ డ్రామాలకు మాత్రం సమయం ఉందా?" అని కీర్తిరెడ్డి ప్రశ్నించారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలను ఎండగడతా** అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న రాజకీయాలు ప్రజలకు ఉపయోగపడేవి కావని కీర్తిరెడ్డి అన్నారు. ఇరు పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. "కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్ని రాజకీయ డ్రామాలు చేసినా ప్రజలు ఇక నమ్మే పరిస్థితిలో లేరు. అసెంబ్లీలో జరిగే ప్రతి పరిణామాన్ని ప్రజా క్షేత్రంలోకి తీసుకెళ్లి.. ఈ రెండు పార్టీల అసలు రాజకీయ స్వరూపాన్ని ప్రజలకు వివరిస్తాం" అని ఆమె స్పష్టం చేశారు.

**ఆల్టర్నేట్ మేమే** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిపోయిందని కీర్తిరెడ్డి తెలంగాణలో ప్రత్యామ్నాయం బీజేపీనే అన్నారు. "గతంలో బీఆర్ఎస్ ప్రజలను నమ్మించి మోసం చేస్తే.. కాంగ్రెస్ అంతకుమించి ప్రజలను నిరాశపరిచింది కాబట్టే.. వాటికి ప్రత్యామ్నాయంగా ప్రజలు బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఆ మార్పుకు బీజేపీ నాయకత్వం వహిస్తుందని ఆమె అన్న "ఎక్కడైతే ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకున్నారో అక్కడ బీజేపీ బలమైన శక్తిగా ఎదిగిందన్నారు.

**మొన్న ఢిల్లీ.. నిన్న వెస్ట్ బెంగాల్.. రేపు తెలంగాణ..**మొన్న ఢిల్లీ ఆప్, నిన్న వెస్ట్ బెంగాళ్ లో టీఎంసీల కోటలు బద్దలు కొట్టినట్లే.. రేపు తెలంగాణలో రైడా అదే తరహాలో ప్రజల మద్దతుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ కోటలను బద్దలు కొట్టి... కమలం జెండా ఎగరేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

**బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి** తెలంగాణ అభివృద్ధి, యువతకు అవకాశాలు, ప్రజా సంక్షేమం, సుపరిపాలన బీజేపీతోనే సాధ్యమన్నఆమె... "రాసిపెట్టుకోండి.. రేపు తెలంగాణలో రాబోయేది డబుల్ ఇంజిన్ సర్కారేననీ.. ఇది ప్రధాని నరేంద్ర మోదీ గ్యారంటీ" అని కీర్తిరెడ్డి స్పష్టం చేశారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం- ఎమ్మెల్యే అరికపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ):**అంజయ్యనగర్, హైటెక్‌సిటీ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శనివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ శంకుస్థాపన చేశారు.అంజయ్యనగర్‌లో హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.1.53 కోట్లు, మాదాపూర్ డాక్టర్స్ కాలనీలో సీసీ రోడ్లు, వరదనీటి కాలువల నిర్మాణానికి రూ.27 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నీలం రవీందర్ ముదిరాజ్, నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో 'జైరా కేఫ్ ఛాయ్ దునియా' ప్రారంభం

**రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన కాలనీ సంక్షేమ సంఘం నేతలు**
**నిర్వాహకుడు గంగాధర్ గౌడ్‌కు ప్రముఖుల శుభాకాంక్షలు**



**జీడిమెట్ల, సెప్టెంబర్ 12, (వార్తాప్రభ) :** జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'జైరా కేఫ్ ఛాయ్ దునియా' టీ స్టాల్ ప్రారంభోత్సవం శనివారం ఉదయం ఘనంగా జరిగింది. దుకాణ యజమాని గంగాధర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాలనీ ప్రతినిధులు, ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుంట సిద్దిరాములు, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తోకల నగేష్ రెడ్డి నూతన దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు గంగాధర్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపి వ్యాపారం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి చింతనూరి రాజు, ఆలయ కమిటీ చైర్మన్ టి. రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, బచ్చ జ్ఞానేశ్వర్, పోగు సమ్మయ్య నేత, వీరారెడ్డి, నరేందర్ రెడ్డి, అప్పల శేఖర్, నదీమ్ రాయ్, కమిటీ సభ్యులు దిడ్డి సురేష్, కుంట బాలయ్య, సుబ్బయ్య, బ్రహ్మయ్య, శివ శంకర్, కట్టెల రమేష్, కుంట పోచయ్య, తిరుమలయ్యతో పాటు వివిధ కాలనీల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా విజయ్ కుమార్ జన్మదిన వేడుక

**- సేవా కార్యక్రమాలు**





**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ):**హఫీజ్‌పేట్ డివిజన్ హుడా కాలనీలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. తాజా మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డితో కలిసి విజయ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. కొండా విజయ్‌కుమార్ సామాజిక బాధ్యతతో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు.శిబిరంలో సుమారు 115 మంది రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రక్తదానం ద్వారా తలసేమియా బాధితులు, గర్భిణులు, ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై ఉన్న అపోహలను వీడి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మై హోమ్ జువెల్ అపార్ట్మెంట్స్ నివాసిత ఓనర్ల ఆందోళన తీవ్రరూపం



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ):**మదీనగూడలోని మైహోమ్ జువెల్ అపార్ట్‌మెంట్స్‌లో సొసైటీ సభ్యుల నిరసన తీవ్రరూపం దాల్చింది.శనివారం క్లబ్‌హౌస్ వద్ద నివాసిత ఓనర్లు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు.సొసైటీ కమిటీ తమ హక్కులకు భంగం కలిగిస్తూ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని సభ్యులు ఆరోపించారు.నిబంధనలకు విరుద్ధంగా సొసైటీ వ్యవహారాలు నిర్వహిస్తున్నారని పేర్కొంటూ జిల్లా సహకార అధికారికి ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు.కమిటీపై కోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నందున అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి,కోశాధికారి పదవులకు రాజీనామా చేసి కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# కృష్ణా జిల్లాలో 135 మద్యం షాపుల రెన్యూవల్.

మచిలీపట్నం సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి) కృష్ణా జిల్లాలోని 135 మద్యం షాపుల లైసెన్సులను మరో ఏడాది పాటు రెన్యూవల్ చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో 123 జనరల్ షాపులు, 12 గీత కులాలకు రిజర్వు చేసిన షాపులు ఉన్నాయి. 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు లైసెన్సుల కాలపరిమితిని పొడిగిస్తూ 2026--27 ఎక్సైజ్ పాలసీ మార్గదర్శకాలను ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.కె. మీనా విడుదల చేశారు.ప్రస్తుత లైసెన్సుదారులు రెన్యూవల్ కోసం లైసెన్స్ ఫీజులో 38 శాతం మేర రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఆర్.ఈ.టి.) చెల్లించాల్సి ఉంటుంది. 50 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.23 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.27.20 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.35.50 లక్షలుగా రెన్యూవల్ ఫీజును నిర్ణయించారు. ఈ మొత్తాన్ని ప్రారంభ దశలోనే ఒకేసారి చెల్లించాల్సి ఉంటుందని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.గీత కులాలకు రిజర్వు చేసిన షాపులకు లైసెన్స్ ఫీజులో 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. జనాభా ఆధారంగా 50 వేల వరకు ఉన్న ప్రాంతాల్లో ఏడాదికి రూ.60.50 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల వరకు ఉన్న ప్రాంతాల్లో రూ.71.50 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.93.50 లక్షలుగా లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. ఈ లైసెన్స్ ఫీజును నాలుగు విడతల్లో చెల్లించుకునే అవకాశం కల్పించారు.పర్మిట్ రూమ్ ఫీజును 50 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.5 లక్షలుగా, అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.7.50 లక్షలుగా నిర్ణయించారు. నిర్దేశించిన రుసుములను చెల్లించి ప్రతి లైసెన్సుదారుడు తమ షాపులను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది.రెన్యూవల్ దరఖాస్తులను సెప్టెంబర్ 12 నుంచి సెప్టెంబర్ 21, 2026 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో లేదా కృష్ణా జిల్లా మద్య నిషేధ, ఎక్సైజ్ కార్యాలయం (బైపాస్ రోడ్)లో సమర్పించుకోవచ్చు. రెన్యూవల్ కాని షాపులకు సెప్టెంబర్ 22 నుంచి సెప్టెంబర్ 29, 2026 వరకు కొత్త దరఖాస్తులను స్వీకరించనున్నారు.కొత్త షాపులకు ప్రతి దరఖాస్తుకు రూ.3 లక్షల దరఖాస్తు రుసుము చెల్లించాలి. ఒక షాపుకు కనీసం నాలుగు దరఖాస్తులు వచ్చినట్లయితే లాటరీ ద్వారా లైసెన్సుదారుని ఎంపిక చేయనున్నారు. రెన్యూవల్ షాపుల దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజుగా రూ.5,000, కొత్త షాపుల దరఖాస్తులకు రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది.రెన్యూవల్ కాని షాపులకు సంబంధించిన లాటరీ వివరాలు, ఇతర సమాచారాన్ని సెప్టెంబర్ 30, 2026న కృష్ణా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో లేదా సంబంధిత ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. మరింత సమాచారం కోసం 8466981837 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## మంగినపూడి సాగరతీరంలో 63 అడుగుల మహాగణపతి

**చరిత్రలో నిలిచే ఆధ్యాత్మిక వేడుకకు ఘన ఏర్పాట్లు**
**గవర్నర్‌ను ఆహ్వానించిన మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)మచిలీపట్నం మంగినపూడి సాగరతీరంలో 63 అడుగుల భారీ మహాగణపతి విగ్రహాన్ని అత్యంత వైభవంగా ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాగరతీరంలో ఇంత భారీ గణపతి విగ్రహాన్ని గతంలో ఎన్నడూ ఏర్పాటు చేయని విధంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.సముద్రపు అలల సాక్షిగా వేలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహించనున్న ఈ మహాగణపతి ఉత్సవం మచిలీపట్నం ఆధ్యాత్మిక, సాంస్కృతిక చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా నిలవనుంది. 63 అడుగుల మహాగణపతి రూపంలో విఘ్నేశ్వరుడిని దర్శించుకోవడంతో పాటు, ఒకవైపు అనంతమైన సాగరం, మరోవైపు భక్తుల భక్తిశ్రద్ధలతో మంగినపూడి సాగరతీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది.ఈ మహత్తర కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించేందుకు ఆంధ్రప్రదేశ్ మంత్రి కొల్లు రవీంద్ర లోక్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.విఘ్నాలను తొలగించే గణనాథుని ఆశీస్సులతో మచిలీపట్నం ప్రజలకు సుఖశాంతులు, సౌభాగ్యం, అభివృద్ధి కలగాలనే ఆకాంక్షతో ఈ సాగరతీర మహాగణపతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులను ఆకర్షించనున్న ఈ వేడుక చిరస్మరణీయంగా నిలిచేలా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి అని కొల్లు అన్నారు.

## గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

**- పశ్చిమ జోన్ డీసీపీ జి.రామకృష్ణ**



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12 (వార్తా ప్రభ ప్రతినిధి): గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పశ్చిమ జోన్ డీసీపీ గుణ్ణం రామకృష్ణ సూచించారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ మండపాల నిర్వాహకులకు శనివారం రాత్రి ఏ కాలనీ ఏఈ అసోసియేషన్ హాల్ లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ పోలీసుల నిబంధనలు అతిక్రమిస్తే సహించేది లేదన్నారు. గణేష్ మండపాల వద్ద ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ముఖ్యంగా ఊరేగింపు సమయంలో డీజే సౌండ్లను నియంత్రించాలన్నారు. విగ్రహాల నిమజ్జనాలను పోలీసులు సూచించిన ప్రాంతంలోనే నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్సైలు చక్రధర్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం మండల ఓబీసీ మోర్చా కమిటీ నియామకం



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12 (వార్తా ప్రభ ప్రతినిధి): బీజేపీ ఇబ్రహీంపట్నం రూరల్ మండల ఓబీసీ మోర్చా కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. బీజేపీ మండల అధ్యక్షురాలు పయ్యావుల జయలక్ష్మి రాము అధ్యక్షతన ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందుల సుబ్రహ్మణ్యం, ఓబీసీ మోర్చా మండల ఇన్ చార్జి వల్లెం కృష్ణకుమారి ఆధ్వర్యంలో మండల ఓబీసీ నూతన అధ్యక్షుడిగా గంపసంతల మురుగేష్ ను ఎన్నుకున్నారు. బీజేపీ బలోపేతానికి, మోర్చా అభివృద్ధికి బలమైన నాయకులను ఎన్నుకుంటున్నట్లు జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శులు పయ్యావుల రాము, జి.గణపతి, ఉపాధ్యక్షురాలు గల్లా దుర్గ, వి.బ్రహ్మాచారి, కార్యదర్శి జె.కార్తీక్, బీజేవైఎం అధ్యక్షుడు పయ్యావుల సిద్ధార్థ, వి.నాగ బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నసమారాధన చేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు...

**● కళ్ళే లలిత పేరు మీదుగా నిరంతరాయగా పలు సేవా కార్యక్రమాలు ● ..జోరు వానలో ఆగని కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు. ● ...బారులు తీరిన అన్నార్తులు..● కళ్ళే లలిత వీధిలో 58నెలలు నుండి ప్రతి నెల అన్నసమారాధన.**



పాయకాపురం సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)స్వర్గీయ కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు ప్రతి నెల,నెల,నెలా ప్రవర్ధమానంగా విరాజిల్లుతున్నది.గత58 నెలలు నుండి ప్రతి నెల అన్నదానం నిర్వహిస్తున్నారు. అజిత్ సింగ్ నగర్ స్వర్గీయ కళ్ళే లలిత వీధిలో కళ్ళే లలిత ట్రస్టు ఆధ్వర్యంలో జోరు వానలో కూడా పేదలకు అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు పాల్గొని కళ్ళే లలిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ళే నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెల 12వ తేదిన క్రమం తప్పకుండా,అన్నార్తులు బారులు తీరి ఉంటారని, వారి ఆకలి తీర్చే విధంగా మంచి రుచికరమైన నాన్ వెజ్ వంటలు(స్వీట్,గారె,చికెన్, గుడ్డు,సాంబారు,పెరుగు, పచ్చడి వంటి వివిధ రకాలు)లతో కూడిన గత 58నెలలు నుండి పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కళ్ళే లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.ఎటువంటి విపత్కర పరిస్థితుల్లో కూడా అన్నదానం ఆపకుండా నిర్వహిస్తున్నామని అన్నారు.తమకు కలిగిన ఆర్థిక స్థోమత బట్టి పేదలకు ఆహారాన్ని అందజేయడం జరుగుతుందని అన్నారు.కళ్ళే లలిత బ్రతికి ఉన్న రోజులలో పేదల ఆకలి తీర్చాలని తెలపడం జరిగిందని అందుకే ప్రతి నెల వారికి బోజనాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని కళ్ళే నాగేశ్వరరావు అన్నారు.అంతేకాకుండా కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు ద్వారా పేదల చదువుల నిమిత్తం స్కాలర్షిప్ ఇవ్వడం, సైకిల్ అందజేయడం, నిరంతరం 365రోజులు పాటు చల్లని కూలింగ్ ఫ్రిజ్తో కూడిన చలివేంద్రం ఏర్పాటు,శానిటేషన్ సిబ్బందికి వస్త్రాలు,చెత్త సేకరణకు డస్ట్ బిన్స్ ఇవ్వడం, రోగులకు ఉచిత మెడిసిన్, భోజనాలు, పేద మహిళల జీవనోపాధి నిమిత్తం తోపుడు బండ్లు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ముమ్మందు మరింత సహాయ సహకారాలు ట్రస్ట్ ద్వారా అందిస్తామని ఆయన అన్నారు.ఈకార్యక్రమంలో డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మిముప్పారి హరీష్,జయదుర్గా,మాజీ కార్పొరేటర్ చందన సురేష్ (మామ) ఎమ్.జశ్విన్,జి. ధ్రువన్,అనిల్,ప్రసాద్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మహాగణపతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలి.- కలెక్టర్ డీకే బాలాజి.**



మచిలీపట్నం సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)మంగినపూడి బీచ్ తీరంలో సెప్టెంబర్ 14 నుంచి నిర్వహించనున్న మహాగణపతి ఉత్సవాలకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పటిష్ఠ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ శాఖల వారీగా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు.ఉత్సవ ప్రాంగణంలో విద్యుత్ భద్రత విషయంలో ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా విద్యుత్ దీపాలు, వైరింగ్ తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులతో తనిఖీలు చేయించి భద్రతా ధ్రువీకరణ పొందాలని కలెక్టర్ ఆదేశించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది, వాహనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన వారికి వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం నుంచి కార్యక్రమం ముగిసే వరకు రెండు షిఫ్టుల్లో వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులతో కూడిన బృందాలు విధుల్లో ఉంటాయని, అంబులెన్స్‌ను కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు.భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున జన సమూహ నియంత్రణ, ట్రాఫిక్ రెగ్యులేషన్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా జనసందోహాన్ని నియంత్రించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.విగ్రహాల నిమజ్జనం కోసం గిలకలదిండి హార్బర్ ప్రాంతాన్ని వినియోగిస్తున్న నేపథ్యంలో అక్కడ అవసరమైన బారికేడింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు. అక్కడ అవసరమైన కనీస భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు స్వయంగా ప్రదేశాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో మత్స్యశాఖ, మెరైన్ పోలీసుల సమన్వయంతో మత్స్యకారులు, పడవలు, స్విమ్మర్లను లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్‌లతో సిద్ధంగా ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు.భక్తులకు నాణ్యమైన తాగునీరు, తగినన్ని మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి నాణ్యతను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, సరఫరా ప్రాంతాల్లో బాధ్యతాయుత సిబ్బందిని నియమించి నాణ్యతను నిర్ధారించాలని ఆదేశించారు. పారిశుధ్య చర్యల్లో భాగంగా ప్రధాన రహదారులు, పరిసర ప్రాంతాల్లో బుష్ క్లియరెన్స్, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు తదితర పనులు దాదాపు 95 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ఉత్సవాలు జరిగే అన్ని రోజులూ పారిశుధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.ఉత్సవాల సందర్భంగా పది రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. భక్తుల రాకపోకలకు ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రారంభంగా రెండు బస్సులను నడిపి భక్తుల రద్దీని బట్టి అవసరమైన మేరకు బస్సుల సంఖ్యను పెంచుతామని తెలిపారు. బస్సుల టర్నింగ్, పార్కింగ్ ప్రాంతాలను పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని నిర్ణయించాలని కలెక్టర్ సూచించారు.ఉత్సవాలకు వచ్చే ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. చివరి నిమిషంలో తలెత్తే సమస్యలకు కూడా తక్షణమే స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి చిన్నపాటి లోపం కూడా పెద్ద సమస్యగా మారకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో బందరు ఆర్డీఓ కే సాంబశివరావు, కార్యక్రమ నోడల్ అధికారి డిఆర్డిఏ పీడీ హరిహరినాథ్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం లే అవుట్లలో రూ.80 లక్షలతో అంతర్గత రహదారుల నిర్మాణం

**గాజులపేట, ఈలప్రోలు లే అవుట్లలో పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**





ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12(వార్తా ప్రభ ప్రతినిధి):ఇబ్రహీంపట్నం మండలంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. గాజులపేట లే అవుట్, ఈలప్రోలు లే అవుట్లలో అంతర్గత రహదారుల నిర్మాణానికి డి.ఎం.ఎఫ్ నిధులతో చేపట్టనున్న పనులకు మైలవరం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు.గాజులపేట లే అవుట్లో రూ.40 లక్షల డి.ఎం.ఎఫ్ నిధులతో అంతర్గత రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఈలప్రోలు లే అవుట్లో కూడా రూ.40 లక్షల డి.ఎం.ఎఫ్ నిధులతో అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.రెండు లే అవుట్లలో కలిపి మొత్తం రూ.80 లక్షల నిధులతో అంతర్గత రహదారుల నిర్మాణ పనులు చేపట్టడం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి రానుంది. లే అవుట్లలో రహదారుల సమస్యకు పరిష్కారం లభించడంతో ప్రజలు, స్థానిక నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కూటమి ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను దశలవారీగా మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో మౌలిక సదుపాయాల కల్పనకు మరింత ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ అక్కల రామ్మోహన్రావు (గాంధీ), మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, జంపాల సీతారామయ్య, స్థానిక కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో జాతీయ పోషకాహార మాసోత్సవం

**పౌష్టికాహారం పై తల్లులకు అవగాహన**





చేజర్ల సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నెల రోజులపాటు జరిగే జాతీయ పోషణ మాసం 2026 కార్యక్రమాన్ని గొల్లపల్లి అంగన్వాడీ -2 కేంద్రాల్లో శనివారం నిర్వహించడం జరిగిందని సెక్టార్ సూపర్వైజర్ ఎం.పద్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా గర్భవతులు బాలింతలు తల్లులందరినీ సమావేశ పరిచి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలపై తల్లులకు వివరించడం జరిగింది. అంగన్వాడీ కేంద్రాల్లో ఆరోగ్యకరమైన పప్పులు చిరుధాన్యాలు ఆకుకూరలు కూరగాయలు పండ్లు పాలు గుడ్లు వంటి పౌష్టికాహారం లభిస్తుందని తెలిపారు. పౌష్టికాహారం తయారీ విధానాన్ని తల్లిలందరికీ చేసి చూపించడం జరిగింది. అదేవిధంగా ప్రతిరోజు గర్భవతులు బాలింతలు తీసుకునే ఆహారంలో పాలు గుడ్డు పప్పు దినుసులు ఆకుకూరలు అన్నీ ఉండేలా చూసుకోవాలని మునగాకు వల్ల చాలా వ్యాధులు రాకుండా ఉంటాయని మునగాకు ప్రతి ఒక్కరూ వారంలో కనీసం రెండు రోజులైనా తీసుకుంటే రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉంటారని ఆమె మాట్లాడుతూ తల్లులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త భూలోకం విజయ కుమారి గర్భవతులు తల్లులు అంగన్వాడి అసిస్టెంట్ పలమాల మానస పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీసుల సూచనలు





విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి) వినాయక చతుర్థి సందర్భంగా గణేష్ ప్రతిమల ఏర్పాటుకు అనుమతులు కోరిన నిర్వాహకులతో చిట్టినగర్ నగరాల సీతారామ కళ్యాణ మండపంలో పశ్చిమ డివిజన్ ఏసీపీ దుర్గారావు, టూటౌన్ సీఐ కొండలరావు, ఎస్ఐలు సమావేశమయ్యారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై నిర్వాహకులకు సూచనలు చేశారు. శాంతిభద్రతలకు విఘతం కలుగకుండా వేడుకలు నిర్వహించాలని, డీ జె లు సౌండ్ పెంచి ఇతరులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. పందిళ్ళు వద్ద ముఖ్యంగా అఖండ దీపాలవద్ద భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పందిళ్ళు భక్తి శ్రద్దలతో నిర్వహించానని సూచించారు. నిమజ్జనం రోజు మద్యం సేవించి అరుపులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించాల న్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## ఇంటి వ్యర్థాలు ఇవ్వండి.. మట్టి వినాయకుడిని తీసుకెళ్లండి

**- చంద్రగిరిలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాలతో వినూత్న కార్యక్రమం**



చంద్రగిరి:సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)పర్యావరణ పరిరక్షణతో పాటు సనాతన ధర్మ సంప్రదాయాలను ప్రోత్సహించే లక్ష్యంతోచంద్రగిరిలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని) ఆదేశాల మేరకు 'గ్రీన్ షాప్' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న వ్యర్థాలను గ్రీన్ షాప్‌కు తీసుకొచ్చి అందజేసే ప్రజలకు సహజసిద్ధమైన మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు.ప్లాస్టిక్, ఇనుము, అట్టపెట్టెలు, పాత పుస్తకాలు, పాత వార్తాపత్రికలు తదితర నిరుపయోగ వస్తువులను స్థానికులు గ్రీన్ షాప్‌లో అందజేశారు. వాటికి బదులుగా మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను డీపీఓ సుశీలాదేవి, డిప్యూటీ ఎంపీడీఓ ఐ.ఎన్. షణ్ముగం, చంద్రగిరి పంచాయతీ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి స్థానికులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రసాయనాలతో తయారైన విగ్రహాల నిమజ్జనం వల్ల జలవనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పూజించి నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని తెలిపారు. ఇళ్లలోని నిరుపయోగ వస్తువులను సేకరించడం ద్వారా పరిసరాల పరిశుభ్రతను మెరుగుపరచడంతో పాటు పర్యావరణహిత వినాయక చవితిని నిర్వహించవచ్చన్నారు.ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రాజకీయాలకు.. అతీతంగా వక్ఫ్ భూముల పరిరక్షణకు అన్ని వర్గాల మద్దతు కీలకం.

- వక్ఫ్ బచావో జేఏసీ ధర్నాకు ఇఫ్టు సంఘీభావం.
- ఇఫ్టు జాతీయ కార్యదర్శి షేక్షావలి.



**జవహర్ నగర్, సెప్టెంబర్ 12 (వార్తా ప్రభ):** రాజకీయాలకు అతీతంగా వక్ఫ్ భూముల పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజల మద్దతు అవసరమని వక్ఫ్ బచావో జేఏసీ ధర్నాకు ఇఫ్టు సంఘీభావంగా నిలుస్తుందని ఇఫ్టు జాతీయ కార్యదర్శి షేక్షావలి పేర్కొన్నారు . రాయదుర్గ లోని జామియా నిజామియా వక్ఫ్ భూమిని వేలం వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం రోజు ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు భారత కార్మిక సంఘాల సంఘీభావాన్ని తెలియజేస్తున్నామని ఇఫ్టు జాతీయ కార్యదర్శి షేక్షావలి తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవడానికి జేఏసీ చేస్తున్న న్యాయమైన డిమాండ్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వం వక్ఫ్ భూముల వేలం విషయంలో ప్రజాస్వామికంగా వ్యవహరించాలని సూచించారు. వెంటనే భూముల అమ్మకాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డ్ అధికారుల నిర్లక్ష్యం ముస్లిం మైనారిటీల విద్య ఉపాధి ఇతర సామాజిక వర్గాల ప్రజల ప్రయోజనాలు దెబ్బ తినే ప్రమాదం ఉందని రాజకీయాలకు అతీతంగా వక్ఫ్ భూములను పరిరక్షించాలని కోరారు. దీనికి అన్ని వర్గాల మద్దతు ఐక్యత ఎంతో కీలకం అన్నారు. జేఏసీ కన్వీనర్ అబ్దుల్ హబీబ్ నాయకత్వంలో నడుస్తున్న ఉద్యమానికి ధర్నాకు భారీ సంఖ్యలో ప్రజలు ఇందిరా పార్కు కు చేరుకొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మట్టి వినాయకుడితో పర్యావరణ పరిరక్షణకు పిలుపు

**- జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**



**తిరుపతి: సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని జనహిత ఫౌండేషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం తిరుపతి నగరంలోని పద్మావతి పార్కు, జగ్జీవన్ రామ్ పార్కుల వద్ద ప్రజలకు అవగాహన కల్పించే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధినేతలు డాక్టర్ టి. జనార్ధన్, లయన్ కె.ఎన్.ఆర్. ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. నగరంలో చెత్తను రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్లలోనే వేయాలని సూచించారు. రానున్న దీపావళిని కూడా పర్యావరణహితంగా నిర్వహించాలని కోరారు. చెట్ల పెంపకం, పార్కుల అభివృద్ధి, పరిశుభ్రత కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంత లా కళాశాల విద్యార్థి నాయకుడు గురురాజ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, పట్టాభి, కేశవ్, వివేక్, చంద్రబాబు, జ్యోతి, లోకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న లేబర్ కాలనీ భవనాలను వెంటనే ఖాళీ చేయాలి

**నివాసితుల భద్రత దృష్ట్యా అధికారులు సూచన - సంబంధిత శాఖల సమన్వయంతో తదుపరి చర్యలు**



**విజయవాడ:సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కార్మిక శాఖ కమిషనర్, ఆంధ్రప్రదేశ్, విజయవాడ వారి ఆదేశాల మేరకు విజయవాడ నగరంలోని విద్యాధరపురం లేబర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన భవనాలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించారు. విద్యాధరపురం లేబర్ కాలనీలో మొత్తం 6 బ్లాకుల్లో 48 ఫ్లాట్లు ఉండగా, వాటిలో సుమారు 40 ఫ్లాట్లలో కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రస్తుతం ఆయా భవనాలు శిథిలావస్థకు చేరినందున వాటిలో నివసిస్తున్న కుటుంబాలకు ప్రాణనష్టం, ఆస్తినష్టం, ఆర్థిక నష్టం సంభవించే ప్రమాదం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో నివాసితులు భవనాలను వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న భవనాలను ఖాళీ చేయాల్సిందిగా సంబంధిత నివాసితులకు ఇప్పటికే 25.11.2025న నోటీసులు జారీ చేసినప్పటికీ, కొంతమంది ఇప్పటికీ ఆయా భవనాల్లో నివసిస్తున్న నేపథ్యంలో వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని మరోసారి భవనాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, రోడ్లు మరియు భవనాల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని భవనాల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, నివాసితుల భద్రతకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు గుంటుపల్లి ధనలక్ష్మి, ఉప కార్మిక కమిషనర్, విజయవాడ తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసించడం వల్ల ఎటువంటి ప్రమాదం సంభవించినా ప్రాణనష్టం, ఆస్తినష్టం మరియు ఆర్థిక నష్టం జరిగే అవకాశం ఉన్నందున, నివాసితులు అధికారుల సూచనలను పాటించి స్వచ్ఛందంగా భవనాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలను కొనసాగిస్తున్నట్లు ఉప కార్మిక కమిషనర్ తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణపై... అవగాహన కల్పించడమే లక్ష్యం

## యునైటెడ్ హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ



**జవహర్ నగర్ సెప్టెంబర్ 12 (వార్తా ప్రభ):** పర్యావరణ పరిరక్షణకై అవగాహన కల్పించడమే లక్ష్యమని యునైటెడ్ హెల్పింగ్ హ్యాండ్ నిర్వాహకులు తెలిపారు. 2026 వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో యునైటెడ్ హెల్పింగ్ హ్యాండ్స్ 369 ఆధ్వర్యంలో 3,000 పర్యావరణహిత మట్టి గణేష్ విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. చిన్నారులు, కుటుంబాలు, పాఠశాలలు, స్థానిక ప్రజలకు ఈ విగ్రహాలను అందజేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా సహజమైన మట్టి విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు సందేశాన్ని అందించారు. యునైటెడ్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు శ్రీ ఎస్.ఎల్. రాజేష్ మార్గదర్శకత్వంలో, డైరెక్టర్ శ్రీమతి జె. సునీత ఆధ్వర్యంలో, సంస్థ బృందం మరియు వాలంటీర్ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. చిన్నారుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించడంతో పాటు "గ్రీన్ గణేష్ -- పర్యావరణహిత వినాయక చవితి" అనే సందేశాన్ని సమాజంలోకి తీసుకెళ్లడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. 2009 నుంచి యునైటెడ్ హెల్పింగ్ హ్యాండ్స్369 సంస్థ విద్య, ఆరోగ్యం, పోషణ, సామాజిక సంక్షేమ రంగాల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అనాథ, సెమీ-అనాథ, పేద మరియు ఒంటరి తల్లిదండ్రుల పిల్లల విద్యకు సహాయం చేయడంతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది.

# సేంద్రియ సాగుతో ఆరోగ్యకరమైన ఆహారం

## రైతులకు ఆదర్శంగా ఉప్పలపాటి చక్రపాణి వ్యవసాయ క్షేత్రం



**ఏలూరు: హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 12(వార్తాప్రభ)**ఏలూరు జిల్లా పెదవేగి మండలంలోని ఉప్పలపాటి చక్రపాణి అభివృద్ధి చేస్తున్న సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్ని రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో సాగు చేస్తున్న వివిధ పంటలను పరిశీలించి, సేంద్రీయ సాగు విధానాలపై చక్రపాణిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రధానంగా సేంద్రీయ లక్‌డంగ్ పసుపు రకం సాగు, విత్తనాభివృద్ధి, సేంద్రీయ కొబ్బరి సాగు, విత్తనాభివృద్ధి పద్ధతులతో పాటు మిరియాలు, దాల్చిన చెక్క సాగు, వాటి యాజమాన్య పద్ధతుల గురించి చలసాని ఆంజనేయులు ఆసక్తిగా తెలుసుకున్నారు. ప్రకృతి ఆధారిత పద్ధతుల్లో పంటల సాగును ప్రత్యక్షంగా పరిశీలించారు. గత 17 సంవత్సరాలుగా సేంద్రీయ వ్యవసాయాన్ని కొనసాగిస్తూ, ప్రకృతికి అనుకూలమైన సాగు విధానాలను పాటిస్తున్న ఉప్పలపాటి చక్రపాణిని ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు. సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన పెంచుకుంటూ, వినూత్న పద్ధతులను అనుసరిస్తూ ఎంతో మంది రైతులకు ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మరింతగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని చలసాని ఆంజనేయులు అన్నారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి ఆధారిత సాగు విధానాలను ప్రోత్సహించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయ క్షేత్రం సందర్శన సందర్భంగా పంటల సాగు, విత్తనాభివృద్ధి, ప్రకృతి ఆధారిత వ్యవసాయ విధానాలపై ఇరువురు చర్చించారు.

# ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు పనితీరు భేష్

**- జాతీయ ఉప సిఈవో డా. అబ్దుల్ ఖయూమ్ ప్రశంస -విజయవాడలో అటవీశాఖతో ఉమ్మడి సమీక్ష రాజమండ్రిలో క్షేత్రస్థాయి పర్యటన - ఏపీ సిఈవో ఆవుల చంద్రశేఖర్ కృషికి కితాబు**







**విజయవాడ / రాజమండ్రి, సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సమగ్ర విధానంలో ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు (ఏపీఎంఏపీ) పనితీరు చాలా బాగుందని సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి, కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ, జాతీయ ఔషధమొక్కల బోర్డు ఉప సీఈవో డాక్టర్ అబ్దుల్ ఖయూమ్ ప్రశంసించారు. కేంద్ర ఆయుష్ శాఖ, రాష్ట్ర అటవీ శాఖ, ఏపీఎంఏపీ బోర్డు అధికారులతో కలిసి శనివారం విజయవాడలో ఉమ్మడి సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ నుంచి విజయవాడకు చేరుకున్న ఆయన శనివారం రాష్ట్రంలో బిజీబిజీగా గడిపారు. తొలుత విజయవాడలోని ఏపీఎంఏపి బోర్డు కార్యాలయాన్ని సందర్శించారు. రాష్ట్ర బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈవో) ఆవుల చంద్రశేఖర్ సాగిస్తున్న నిరంతర కృషిని ప్రత్యేకంగా అభినందించారు. లండన్ మహానగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హాల్ లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి అంతర్జాతీయ అవార్డును చంద్రశేఖర్ అందుకోవడం స్ఫూర్తిదాయకమని కితాబునిచ్చారు. కార్యాలయంలోని ప్రయోగశాల, హెర్బల్ మ్యూజియమ్, విలువ ఆధారిత సేవలు, విత్తనాల గోడౌన్, పొందుపరిచిన జాబితా, సాగుబడి విధానం, బోర్డు వెబ్ సైట్, మొక్కలకు సంక్రమించే వ్యాధులు, పరిష్కారాలను సూచించే పుస్తకాలను జాతీయ ఉప సీఈవో సమగ్రంగా పరిశీలించారు. అవసరమైన యంత్రాలు, పనిముట్లు, పచ్చదనం, పరిశుభ్రతతో పాటు బోర్డు కార్యాలయ ప్రాంగణాన్ని సుందర నందనవనంగా తీర్చిదిద్దిన అధికారులు, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. సిఈవో ఆవుల చంద్రశేఖర్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర బోర్డు కార్యక్రమాలను, ప్రతిపాదనలను, భవిష్యత్ ప్రణాళికలను జాతీయ ఉప సిఈవో క్షుణ్ణంగా పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. పలు వ్యవసాయ క్షేత్రాల్లో ఔషధ, సుగంధ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించటం, రైతులకు విలువ ఆధారిత సేవలను అందించడాన్ని తెలుసుకుని ప్రశంసించారు. ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు పనితీరును సీఈవో ఆవుల చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. అనంతరం అరణ్యారామం, నర్సరీ, హెర్బల్ గార్డెన్ ను జాతీయ ఉప సిఈవో సందర్శించారు. అక్కడే గోడౌన్ వద్ద మొక్కను నాటి నీళ్లు పోశారు. తర్వాత చంద్రశేఖర్ తో కలిసి డా. అబ్దుల్ ఖయూమ్ రాజమండ్రిలో క్షేత్రస్థాయి పర్యటన సాగించారు. హెర్బల్ గార్డెన్, వాటర్ ప్లాంటేషన్, విలువ ఆధారిత సేవలు, ప్రయోగశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్యకర సమాజ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేషకృషి సాగిస్తున్నాయని జాతీయ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు (ఎన్ఎంపీబి) ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి డా. అబ్దుల్ ఖయూమ్, రాష్ట్ర సిఈవో ఆవుల చంద్రశేఖర్ లు అన్నారు. వనాల్లోని అమూల్యమైన ఔషధ మొక్కల సంపదను కాపాడేందుకు అధికారులు, రైతులు సమిష్టికృషి సాగించాలని వారు పిలుపునిచ్చారు. అడవుల్లోని జీవవైవిధ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. వనాల్లో పెరిగే గడ్డి, ఆకులు, మొక్కలు, తీగలు, కందమూలాలు, పొదలు శాఖాహార జంతువులకు ఎంతో అవసరమన్నారు. ఆ జంతువుల రోగనిరోధక శక్తి కోసం, ఎలాంటి రసాయన మందులు లేని సహజమైన ఆహారమే వైద్యునిగా పనిచేస్తాయన్నారు. వాటి ఆవాసాలను అభివృద్ధి చేయాలని, ఔషధ గుణాలున్న గడ్డిని, మొక్కలను అగ్ని ప్రమాదాల నుండి కాపాడాలని సూచించారు. అడవుల మీద ఒత్తిడిని తగ్గించడానికి, స్మగ్లింగ్ ను నియంత్రించడానికి, తగిన పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు కూడా తగిన శిక్షణ నిస్తున్నామన్నారు. నర్సరీల అభివృద్ధి నైపుణ్యాలను ప్రతి ఒక్కరూ పెంపొందించు కోవాలన్నారు. దాదాపు 22 రకాల మొక్కల ప్రాధాన్యతను ప్రయోగశాల పరిశోధనల ద్వారా గుర్తించి, క్యూఆర్ కోడ్ తో సహా అందుబాటులోకి తెచ్చామన్నారు. తులసి ఆకుల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రోటీన్ గా, శరీరకణాల అభివృద్ధికి, స్పృహ కోల్పోయిన వారికి ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. వడదెబ్బ నుంచి రక్షించే గుణాలు మొక్కజొన్న ఆకుల్లో కూడా ఉన్నాయన్నారు. అశ్వగంధ లాంటి ఔషధ మొక్కల పెంపు మార్కెటింగ్ విధానాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సీఈవో వివరించారు. కల్తీ ఆహార నివారణకు, ఆరోగ్యకర సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఏపి బోర్డు ఉప సీఈవో ప్రదీప్, ఇతర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భక్తితో వినాయక మండపం నిర్మించిన చిన్నారులు

## పెద్దలు, కాలనీ వాసులు సహకరించాలని విజ్ఞప్తి



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 12(వార్తాప్రభ):** జహీరాబాద్ మహేంద్ర కాలనీ లో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నారులు భక్తిశ్రద్ధలతో వినాయకుడి మండపాన్ని ఏర్పాటు చేశారు. తమ సొంత ప్రయత్నంతో మం డపాన్ని అందంగా అలంకరించి గణనాథుడిని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేశారు .చిన్నారుల భక్తి, ఉత్సాహాన్ని అభినందిస్తూ కాలనీలోని పెద్దలు, స్థానికులు వారికి అండగా నిలవాలని నిర్వాహకులు కోరారు. మండపం నిర్వహణ, పూజా కార్యక్రమాలకు కాలనీ వాసులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారులు ఐక్యంగా ముందుకు వచ్చి వినాయక మండపాన్ని ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## మతం...భయం కాదు - భక్తి కావాలి





నిన్న మా ఆవిడ ఒక రీల్ చూసింది ..
బెడ్ మీద ఉన్న తండ్రి ని కూతురు ఆస్తి పత్రాలపై సంతకాలు పెట్టమని ..చేపించుకుందట... పిల్లలు ఎలా తయారు అయ్యారు?? అని బాధ పడింది...
నేను...ఆ అమ్మాయి కరెక్ట్ అన్నాను...ఎలా అంది..
ఆ ఒక్క సంతకం లేకపోతే...ఆ తర్వాత ఆ అమ్మాయి ఎన్ని ఆఫీసుల చుట్టూ తిరగాలి...ఎందరిని బ్రతిమాలాలి.. ఎంతెంత లంచాలు ఇవ్వాలి..
ఔను...అంది...ఆమె మౌనంగా...
ఏదైనా ప్రాక్టికల్ గా ఆలోచించాలి తప్ప
అయినదానికి కాని దానికి...
అందరినీ ఆడిపోసుకోవడం...
మన సమాజంలో వెర్రిగా మారింది...
కేవలం మనమే మన బుర్రకు నెగెటివ్
అభిప్రాయాలు డంప్ చేసి ఫీడ్ చేస్తున్నాం...
ప్రతి విషయంలోనూ ఇంతే...
హారతి గాలికి ఆరిపోతే అరిష్టం....
దేవుడు కి వేరే పనిలేదా..అరిష్టాలు పుట్టించడమా...
పరిసరాలు గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అనే స్పృహ లేకుండా పూజ చేసింది నువ్వు...నెపం దేవుడు మీద!!
మనం మన పిల్లలకు కూడా ఇదే భయం నేర్పుతున్నాం...
హైందవ మతం లో పెద్ద అనైక్యత కు కారణం ఈ లోపభూయిష్టమైన ఆలోచనలే...
మతం అంటే గౌరవం ..ఇష్టం కన్నా మతం లో భయం సృష్టించిన మన దిక్కుమాలిన పనులు వలన పిల్లలకు మతాన్ని గౌరవించి అభిమానించి కలిసి నడవడం బెస్ట్ అని నేర్పకుండా...
ఏం చేస్తే ఏమౌతుందో అని వ్యక్తిగత దోషాల దగ్గరే బ్రెయిన్ డెడ్ చేస్తున్నాం...గుండెల్లో పరిపూర్ణమైన భక్తి .. ప్రేమ .. ఆరాధన ముఖ్యం తప్ప..హారతి ఆరిపోయిందా..తీర్థం ఒలికిపోయిందా ..
కొబ్బరి కాయ వంకరగా పగిలిందా.... వీటి మీద దృష్టి తప్ప...మన మనసును దైవానికి కైంకర్యం చేసామా...అని కాదు ...చూసుకునేది....ఈ సందేహాస్పదమైనది మన హైందవ మతం అని కాకుండా...మనది అచంచలమైన హైందవ ధర్మం అని....
భగవంతుడు నువు పాయసం పెట్టినా..చుక్క నీరు ధారపోసిన... అదే ఫలితం ఇస్తాడని...ఆ నీరు లేకపోయినా...నీ అంతరంగాన్ని ఆర్ద్రత తో తడిపితే...ఆ చెమ్మ పాలసముద్రాన్ని మించిన నివేదన అని.....ఈ పిచ్చి నెగెటివ్ అభిప్రాయాలు తొక్కి పట్టాలని... అందరికీ చెప్పాలనిపిస్తుంది...
పురోహితుడు దీపం ఆరిపోతే కలవరపడడు... తిరిగి వెలిగిస్తాడు...సగం సగం తెలిసీ తెలియని అమాయకులే గాభరా పడి మనసును పాడుచేసుకుని...అందరి మనసులు పాడుచేస్తారు..
హైందవ ధర్మం లో ఏదీ నీకు అంటించుకోవద్దని...
ఏది జరిగినా దైవ నిర్ణయం అని చెప్పారు...
అన్నీ నీ మీద నువ్వే వేసుకుని రేపు ఆ యమధర్మరాజు ముందు నిలబడి ఈ తప్పులు చేసావా అంటే...చేసా...చేసా!!! అని ఎగబడి కమిట్ అయితే నూనెలో వేపుతాడు...



ఏది నువ్వో... నీవు ఎవరు? అనేది తెలుసుకో..
అపోహలు..అనుమానాలు... ఇతరుల కోణం లో బుర్ర లేకుండా చూడటం కాదు...

**-డాక్టర్ ఎమ్మెస్వీ సత్యనారాయణ బాబు (కపర్ది)**
గుడివాడ, కృష్ణా జిల్లా

## విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి.

**మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఖాళీగా ఉన్న 3 మంత్రులు, ఖాళీ కాబోతున్న ఎమ్మెల్సీ పదవులను బీసీలకు ఇవ్వాలి.- వి శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి.**



**హైదరాబాద్,సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ రాజకీయ ముఖచిత్రం రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ , శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి , బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ చిరంజీవులు గారు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షులు బాలగోని బాల్‌రాజు గౌడ్ తో పాటు రాష్ట్రంలోని 55 బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిచాలి. విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 3 మంత్రి పదవులను బీసీలకు కేటాయించాలని, ఖాళీ కాబోతున్న ఎమ్మెల్సీ స్థానాల్లో, కార్పొరేషన్ చైర్మన్, నామినేటెడ్ పదవులలో బీసీలకు, అత్యంత వెనుకబడిన వర్గాలకు (ఎంబీసీలకు) ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. అదేవిధంగా బీసీ కులగణన అంశంపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్ లో మరింత గట్టిగా మాట్లాడాలని, దేశవ్యాప్తంగా కులగణన జరిగేలా బీజేపీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న డిలిమిటేషన్ తో పాటు చట్ట సభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్నికల సమయంలో బీసీలకు హామీలు ఇచ్చి బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించడంతో పాటు రాజకీయ రంగంలోనూ జనాభా ప్రాతిపదికన అన్ని పార్టీల్లో బీసీలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## శ్రీ కాళహస్తి కాలనీలో తీవ్ర డ్రైనేజీ సమస్య దోమల బెడదతో ఇబ్బందులు..



గుడివాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : గుడివాడ పట్టణంలోని శ్రీకాళహస్తి కాలనీ ప్రజలు డ్రైనేజీ, రోడ్ల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిన ప్రతిసారీ రోడ్లు దిగువగా ఉండటంతో వర్షపు నీటితో పాటు డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చి నిలిచిపోతున్నది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా కాలనీలో పిచ్చి గడ్డి విపరీతంగా పెరగడంతో దోమల బెడద ఎక్కువైంది. పాములు, విషపురుగులు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి మరమ్మతులు చేయించాలని, రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని, పిచ్చి గడ్డిని తొలగించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## ఏఎన్నార్ కాలేజీలో ఘనంగా హిందీ దినోత్సవం




గుడివాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.జె.ఎస్. కుమార్ మాట్లాడుతూ హిందీ భాష గొప్పతనం, ప్రాధాన్యతను, దేశ సమైక్యత, సాంస్కృతిక వైవిధ్యంలో హిందీ భాషకు ఉన్న విశిష్ట స్థానాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం లో బి.ఎస్.సి. ద్వితీయ సంవత్సరం అమర్‌నాథ్ బృందం 'నహీ మాలూమ్' అనే హాస్య లఘు నాటికలో హిందీ భాష నేర్చుకోవలసిన ఆవశ్యకతను తెలియచేస్తూ ప్రదర్శించారు. బి.ఎ. ద్వితీయ సంవత్సర విద్యార్థిని అరవింద కబీర్ దాసు పద్యాలనూ, నీతిని తెలియచేసింది. విద్యార్థులు హిందీ భాషకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తమ ప్రతిభను ప్రదర్శించారని కళాశాల హిందీ భాషా విభాగాధిపతి డి. సువర్ణ లక్ష్మి తెలిపారు. హిందీ భాష అభివృద్ధికి విద్యార్థులు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిచేయాలని హిందీ భాషపై మరింత ఆసక్తి పెంచుకుని, కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతరసిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గుడివాడలో పన్నుల హెచ్చరిక.. 30 లోపు కట్టండి.. అభివృద్ధికి చేయూతనివ్వండి



గుడివాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :పురపాలక పరిధిలో పెండింగ్ లో ఉన్న పన్ను బకాయిలను ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగం సెప్టెంబర్ 30తో ముగుస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో ఇంటి పన్ను, ఖాళీ స్థల పన్ను (VLT), కుళాయి పన్ను బకాయిలు ఉన్నవారు వెంటనే చెల్లించాలని సూచించారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తేనే పురపాలక సంఘానికి ఆదాయం సమకూరి పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, వీధి దీపాల వంటి మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు వేగంగా చేయగలమని కమిషనర్ వివరించారు. గడువు దాటితే అపరాధ రుసుము పడుతుందని, కావున ప్రజలంతా సహకరించి పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

## మంగినపూడి సాగర తీరంలో 63 అడుగుల మహాగణపతి

- కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో ఘనంగా సాగర తీర మహాగణపతి ఉత్సవాలు



మచిలీపట్నం,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : మంగినపూడి సాగర తీరంలో నిర్వహిస్తున్న సాగర తీర మహాగణపతి ఉత్సవాలకు మచిలీపట్నం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. దేశ చరిత్రలోనే ప్రత్యేకంగా నిలిచే విధంగా సముద్ర తీరంలో వినాయక ఉత్సవాలను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహాగణపతి ఉత్సవాల్లో 63 అడుగుల భారీ గణపతి విగ్రహం భక్తులకు కనువిందు చేయనుంది. సాగర తీరంలో ఇంత భారీ స్థాయి లో మహాగణపతి ఉత్సవాలు నిర్వహించడం మచిలీపట్నం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఉత్సవాల ఏర్పాట్లను కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా 63 అడుగుల మహాగణపతి స్వామివారిని దర్శించుకుని, సాగర తీరంలో జరుగుతున్న ఈ అద్భుతమైన గణపతి ఉత్సవాలను ప్రతి ఒక్క భక్తుడు కుటుంబ సమేతంగా విచ్చేసి తనివితీరా ఆస్వాదించాలని గోపు సత్యనారాయణ ఆహ్వానం పలికారు.మచిలీపట్నం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా ఈ మహాగణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లు రంగ, పామర్తి లక్ష్మణ్, బడే రమణ, గుమ్మడి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ ఫ్లైఓవర్ కు మోక్షం..

## డిసెంబర్ నాటికి భీమవరం వైపు రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ !



గుడివాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : గుడివాడలో రైల్వే గేట్లపై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. భీమవరం బైపాస్ రోడ్డు వైపు జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భీమవరం వైపు ఫ్లైఓవర్ పై డిసెంబర్ నాటికి రాకపోకలు ప్రారంభించేలా పనులు వేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, రైల్వే శాఖ నుండి అనుమతుల జాప్యం వల్లే ఫ్లైఓవర్ నిర్మాణం ఆలస్యమైందన్నారు. రైల్వే గేట్ల వద్ద ప్రజలు, వాహనదారులు పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. డిసెంబర్ లోపు భీమవరం బైపాస్ వైపు పనులు పూర్తి చేస్తామని, బ్రిడ్జికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు, డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ పనులను కూడా ముందుగానే పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ ఫ్లైఓవర్ పూర్తయితే గుడివాడలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, చీన ఐజు సత్యనారాయణ రావు, మున్సిపల్ కమిషనర్ మనోహర్, NH AE శరత్, టిడిపి నాయకులు ముళ్ళపూడి రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధిని సకాలంలో గుర్తిస్తే.. పూర్తిగా నియంత్రించవచ్చు !

-పట్టణ ఆరోగ్య కేంద్రం సీ.వో. వి రామారావు



గుడివాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : చర్మంపై స్పర్శలేని నొప్పి లేదా దురద లేని మచ్చలు రాగి రంగు మచ్చలు సకాలంలో గుర్తించడం వలన కుష్టవ్యాధిని పూర్తిగా నియంత్రించ వచ్చునని పట్టణ ఆరోగ్య కేంద్ర సి.వో వి రామారావు అన్నారు. స్థానిక 17, 18వ వార్డు, కాకర్ల వీధిలలో కుష్టువ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సి.వో మాట్లాడుతూ సెప్టెంబర్ 11వ తేదీ నుండి 24వ తేదీ వరకు ప్రతి ఇంటికి సర్వే చేయడం జరుగుతుందనీ తెలియచేశారు. కుటుంబ సభ్యులలో మచ్చలు ఉన్న వారిని గుర్తించి సంబంధిత ఆరోగ్య కేంద్రంనకు రిఫరల్ చేసి చికిత్స అనంతరం ఎమ్.డి.టి. మందులను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. వీటితో వ్యాధిని పూర్తిగా మొదటి దశలోనే గుర్తించి నయం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమం లో ఎ.ఎన్.ఎమ్ లు, ఆశ కార్యకర్తలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో సైన్స్ సందడి..

- విజేతలకు ఎమ్యీఓ రజని చేతుల మీదుగా బహుమతులు




గుడివాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుడివాడ పట్టణంలో విద్యార్థులకు నిర్వహించిన సైన్స్ పరీక్షల ముగింపు మరియు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు గుడివాడ మండల విద్యాశాఖాధికారి (ఎమ్యీఓ) రజని ముఖ్య అతిథిగా విచ్చేసి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఈ.ఓ రజని మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి సైన్స్ పరీక్షలు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు షమ్మీర్, ప్రసాద్, వై. కోటేశ్వరరావు, ఎ. విజయ్ కుమార్ లతో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



కృత్తివెన్ను,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమ్మాలపాటి రవి ఆధ్వర్యంలో శనివారం ఈ మధ్య అనారోగ్యంతో చనిపోయిన తోటి తాపీ కార్మికులకు బొడ్డు వెంకన్న (గాలిబు) కి సంతాపం తెలియజేసి తదుపరి బంటుమిల్లి కృత్తివెన్ను మండలాల పెయింటింగ్ వర్కర్ స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక ప్రక్రియ కొనసాగించారు. అధ్యక్షులుగా నారగాని వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా బొర్రా రామకృష్ణ, ట్రెజరీగా ఎడ్లపల్లి సుబ్రమణ్యం (నానాజీ), కార్యదర్శిగా కొమ్మాలపాటి రవి, సహాయ కార్యదర్శిగా గరికముక్కు కళ్యాణ్ కుమార్ (చంటి) కమిటీ మెంబర్స్ గా పడమట రమేష్, తమ్ము సురేష్ గూడవల్లి శివ గరిక ముక్కు రమేష్ ఎంపా ఫ్రాన్సిస్, వీరంకి కృష్ణ ప్రసాద్ గంగిశెట్టి లోకేష్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు నారగాని వెంకటస్వామి మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం కార్మికులందరూ ఐక్యమత్యంగా పోరాడాలని ఐక్యమత్యంగా ఉండాలని అందుకు తన వంతు కృషి శక్తివంతన లేకుండా చేస్తానని ఆయన తెలియజేశారు. కొమ్మాలపాటి రవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 12 14 జీవో ద్వారా సంక్షేమ బోర్డు లోని సంక్షేమ పథకాలు నిలిపివేశారని ఇప్పుడు ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు జరిగిందని సంక్షేమ బోర్డు యధాతధంగా నడిపించకుండా కాలయాపన చేసిందని గత ప్రభుత్వాలు ఐదు సంవత్సరాలు, ఈ కూటమి ప్రభుత్వంలో రెండు సంవత్సరాలు మొత్తం మీద ఏడు సంవత్సరాలు సంక్షేమ బోర్డు లోని కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందలేదని 2026 సంవత్సరం మార్చి ఒకటి నుండి సంక్షేమ బోర్డు రిలీజ్ చేసినప్పటికీ తొమ్మిది సంక్షేమ పథకాలు ఉండగా నాలుగు మాత్రమే అమలుపరుస్తున్నారని గతం లో మాదిరిగా 9 సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఈనెల 30వ తారీకు ఏ ఎల్ ఓ ఆఫీస్ మచిలీపట్నం వద్ద జరిగే సామూహిక రాయబార సభకు కార్మికులందరూ హాజరు కావాలని మరియు అక్టోబర్ 8 తారీకు మచిలీపట్నం కలెక్టరేట్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాకు బంటుమిల్లి, కృత్తివెన్ను రెండు మండలాలు నుండి భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాలు విజయవంతం చేయాలని నూతన కమిటీ మరింత బాధ్యత తీసుకొని యూనియన్లను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఈడే వీరబాబు, వై. కిష్టయ్య( కిట్టు), బొర్రా కన్నబాబు, బొర్రా నాగరాజు, నక్క శేషు, తదితర పెయింటింగ్ వర్కర్స్ కార్మికులు పాల్గొన్నారు.

## బాపట్లలో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం ప్రారంభం

- మాజీ సైనికుల సంక్షేమంలో మరో ముందడుగు
- అప్రమస్స్ రాష్ట్ర కమిటీ నిరంతర కృషికి సత్ఫలితం





బాపట్ల,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాజీ సైనికులు, అమరవీరుల కుటుంబాలు, యుద్ధ వితంతువులు వారి ఆధారితులకు సంక్షేమ సేవలను మరింత చేరువ చేసే దిశగా బాపట్లలో నూతన జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని నూతన జిల్లాల్లో సైనిక సంక్షేమ కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ మిలిటరీ సర్వీస్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్ (అప్రమస్స్ ) చేపట్టిన మాస్టర్ ప్లాన్‌లో భాగంగా 15వ కార్యాలయంగా అందుబాటులోకి వచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కెప్టెన్ సత్యప్రసాద్ , అప్రమస్స్ గౌరవ సలహాదారు మరియు సీనియర్ మాజీ సైనికుడు సుబేదార్ శేషగిరిరావుతో కలిసి నూతన కార్యాలయ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు.

**అధికారుల ప్రశంసలు -- హామీ:** బాపట్లలో ఈ కార్యాలయ ఏర్పాటుకు దాతలను సమీకరించి, అంకితభావంతో విశేష కృషి చేసిన అప్రమస్స్ రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ని మరియు వారి బృందాన్ని గుంటూరు జస్వో ఆర్ . గుణశీల ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యాలయం ద్వారా బాపట్ల పరిసర ప్రాంతాల వెటరన్లకు అన్ని రకాల సంక్షేమ పథకాలు, ధ్రువీకరణ సేవలు వేగవంతంగా అందుతాయని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన డిమాండ్ల మేరకు, సైనికుల సంఖ్య (స్ట్రెంగ్త్ ) ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ దశలవారీగా జస్వో కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కర్నల్ ఎస్ .ఎన్ . రావు, ప్రకాశం జిల్లా జస్వో కర్నల్ రహీమ్, నవాబ్ జాన్ తదితర ప్రముఖుల తో పాటు బాపట్ల, రేపల్లె, చందోలు, నిజాంపట్నం, చీరాల, చినగంజాం తదితర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో మాజీ సైనికులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానికంగానే సైనిక సంక్షేమ కార్యాలయం ఏర్పాటవడం పట్ల మాజీ సైనికులు మరియు వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

### శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించిన టీటీడీ

తిరుమల,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు అధికారికంగా ఆహ్వానించారు. అమరావతి సమీపంలోని ఉండవల్లి వద్ద గల సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని టీటీడీ చైర్మన్, ఈవోలతో పాటు బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జానకీదేవి కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

### 18న వాహనాల బహిరంగ వేలం

కాకినాడ, సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ నార్త్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఆటో, హోండా షైన్ ద్విచక్ర వాహనాలను ఈనెల 18వ తేదీన ఉదయం 10.30 గంటలకు వేలంపాట వేస్తున్నట్లు నార్త్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆలీ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా ధరావతు చెల్లించి, వాహనం దక్కించుకున్న తక్షణం పాట సొమ్ముతో పాటు జీఎస్టీ చెల్లించాలన్నారు. వివరాలకు 8317554510 నెంబర్లో సంప్రదించాలన్నారు.

## లోక్ అదాలత్ లో 3257 కేసులు పరిష్కారం

-లోక్ అదాలత్ చైర్మన్ ఎం.శైలజ



మైలవరం,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : దేశవ్యాప్తంగా జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా మైలవరంలో జరిగిన లోక్ అదాలత్ లో 3257 కేసులు పరిష్కారం అయ్యా యని మైలవరం మండల లీగల్ సర్వీస్ చైర్మన్, జడ్జి ఎం. శైలజ తెలిపారు. శనివారం ఉదయం మైలవరం కోర్ట్ హాల్లో న్యాయవాదులు ఉద్దేశించి, జడ్జి శైలజ రాజీపడతానికి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, ఎక్సైజ్, మనోవర్తి కేసులు రాజీ చేసుకుని కక్షిదారులు సమయము డబ్బు ఆదా చేసుకోవచ్చు అని ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో మైలవరం బార్ అసోసియేషన్ న్యాయవాదు లు వి.టి.కిషోర్, ఏజిపి ఏడి ప్రసాద్, జి.శ్రీనివాసరావు, ఎం.రవికుమార్ శివ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ 4700 సమ్మరీ ట్రయిల్ కేసులు పరిష్కరించిన స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్

మచిలీపట్నం,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఆధ్వర్యంలో శనివారం నాడు లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 4700 సమ్మర్ ట్రయిల్ కేసులు (పెట్టీ కేసులను )పరిష్కరించబడ్డాయి.నగర పరిధిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆర్ పేట మచిలీపట్నం చిలకలపూడి ఇనకుదురు పోలీస్ స్టేషన్ లకు సంబందించిన కేసులు ఈ లోక్ అదాలత్ కు వచ్చాయి. వీటిని స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ భూపతిన శ్రీనివాస్ విచారించి పరిష్కరించారు.

## మద్యం షాపుల నవీకరణకు దరఖాస్తులు చేసుకోండి



కాకినాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులకు 2026-2027 సంవత్సరంనకు గాను మద్యం షాపులకు (రెన్యువల్) నవీకరణ చేయుటకు ఉత్తర్వులు మంజూరు చేయగా, ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి, కాకినాడ, కాకినాడ జిల్లా పరిధిలో గల 170 మద్యం షాపులకు 2026-2027 సంవత్సరం నకుగాను రెన్యువల్ చేయుటకు గాను అవకాశం కల్పించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్ తెలిపారు. కాకినాడ జిల్లా కలక్టర్ గజిట్ నెంబర్ 38 తేది 12-09-26 న గజిట్ను విడుదల చేసియున్నారని అన్నారు. సంబంధిత మద్యం షాపుల లైసెన్సీ దారులు అందరు 2024-2026 సంవత్సరం నకుగాను మీ మద్యం షాపుకు సంబంధించి ఏవిధమైన బకాయిలు ఉండరాదని, గజిట్ నందు తెల్పిన విధముగా 2026-2027 సంవత్సరం నకు గాను రెన్యువల్ ఎక్సైజ్ టాక్స్, రిటైల్ ఎక్సైజ్ టాక్స్, పర్మిట్ రూమ్ రిటైల్ ఎక్సైజ్ టాక్స్, దరఖాస్తు ఫీజు కట్టి సంబదిత చలానాలు కట్టి ఆన్లైన్ ద్వారా మీ మద్యం షాపు రెన్యువల్ చేయుట కొరకు దరఖాస్తు చేసుకొనవలసినదిగా తెలియచేశారు. మద్యం షాపు రెన్యువల్ కొరకు దరఖాస్తును 21వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటలలోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కొరకు గజిట్ నెంబర్ 38 తేది 12-09-26 ప్రచురించిన గజిట్ ను ఈ జిల్లాలో గల అన్ని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ లలో అందుబాటులో ఉంచడమైనదని అన్నారు.

## బిజెపి జిల్లా అధికార ప్రతినిధిగా జక్కా శ్రీనివాస్ యాదవ్




బాపట్ల,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : బి.జె.పి. బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి గా జక్కా శ్రీనివాస్ యాదవ్ ను నియమిస్తూ భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు ఎం.వెంకట రమణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జక్కా శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. బిజెపి సిద్ధాంతాలు, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో అత్యంత క్రమశిక్షణ, అభివృద్ధి చెందిన దేశంగా ప్రధాని నరేంద్ర మోడీ నిలబెట్టారన్నారు. గత ప్రభుత్వంలో అస్తవ్యస్తమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించిదని, అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు జక్కా శ్రీనివాస్ తెలిపారు.

## ప్రతి ఇంటికి రెండు పూటల తాగునీరు సంబరాలు చేసుకుంటున్న ప్రజలు





విస్సన్నపేట,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) : మండు వేసవిలో నీటి వనరులు అడుగంటుకొని పోవడంతో త్రాగునీటి సరఫరాకు స్థానిక మండల కేంద్రంలో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వాతావరణం లో మార్పులు కురుస్తున్న వర్షాలు భూమిలో నీటి శాతం పెరుగుతున్న వైనం వెరసి మండల కేంద్రంలో రెండు పూటలా ఫుల్ టైం త్రాగునీరు అందించే ప్రక్రియ సులువు కావటంతో తెలుగింటి ఆడపడుచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అధికారి సిహెచ్ చిన్న రాట్నాలు ఆదేశాలతో ఈవో హరి కృష్ణ కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో 30000 రూపాయలతో ప్రధాన వాటర్ ట్యాంక్ గేటు వాల్ మార్పు చేసే విషయంలో గ్రామపంచాయతీ సిబ్బంది రాత్రి పగలు నిరంతరంగా చేసిన శ్రమ ఫలితంగా సక్సెస్ ఫుల్ గా గేట్ వాల్ మార్పు జరిగింది. శనివారం ఉదయం మరియు సాయంత్రం రెండు పూటల త్రాగునీటి సరఫరా గతంలో కన్న అంతకుమించి అన్న చందంగా సరఫరా కావడంతో ఇంటింటా పండగ వాతావరణం నెలకొన్నదని అనుకుంటున్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి మహిళలు ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# ఉద్యోగులకు రెండు డీఏలు.. పెన్షనర్లకు రెండు డీఆర్‌లు

● ముఖ్యమంత్రి నిర్ణయాత్మక హామీ కి నిదర్శనం.. ● హర్షం వ్యక్తం చేసిన ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్



**విజయవాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఈ నెల 5వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన చర్చల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు రెండు డీఏలు, పెన్షనర్లకు రెండు డీఆర్‌లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉద్యోగులు, పెన్షనర్ల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేస్తూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 01-07-2024, 01-01-2025 తేదీలకు సంబంధించిన రెండు డీఏలను ఉద్యోగులకు, రెండు డీఆర్‌లను పెన్షనర్లకు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని విద్యాసాగర్ పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఉద్యోగుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు . రెండు డీఏలు, రెండు డీఆర్‌లకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడటంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లలో ఆనందం నెలకొందని, ప్రభుత్వం--ఉద్యోగ సంఘాల మధ్య పరస్పర విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయించవలసిన బాధ్యత తమకు ఉందని ఆ దిశగా కృషి చేస్తున్నామని విద్యాసాగర్ అన్నారు. మిగిలిన అంశాలకు సంబంధించిన జీవోలు కూడా అతి త్వరలో విడుదలవుతాయని, ముఖ్యమంత్రి--ఉద్యోగ సంఘాల సమావేశానికి సంబంధించిన మినిట్స్ కూడా త్వరలో విడుదలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 5న జరిగిన చర్చల్లో ప్రస్తావించిన, ఇంకా పరిష్కారం కావాల్సిన ఇతర ఉద్యోగుల సమస్యలపై కూడా ఏపీ జేఏసీ, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తాయని విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం ఒక నిరంతర ప్రక్రియ అని, ఉద్యోగుల సంక్షేమం, హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సానుకూల ఫలితాలు సాధించేవరకు తమ నిరంతర కృషి కొనసాగుతుందని విద్యాసాగర్ స్పష్టం చేశారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయాన్ని కలిసి మరింత అభివృద్ధి చేద్దాం..

● మీడియా మిత్రులతో పాలకమండలి చైర్మన్ చుంచు రమేష్ బాబు మరియు పాలకమండలి సభ్యులు



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో వేశీ చేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ దేవస్థానం నూతనంగా ఏర్పడిన పాలక మండల చైర్మన్ సభ్యులు పరిచయ వేదిక కార్యక్రమాన్ని శనివారం శ్రీ గోపస్వామి సదన్ లో ని కళ్యాణ మండపం లో నిర్వహించారు,ఈ కార్యక్రానికి ముఖ్య అతిథిగా శ్రీ తిరుపతమ్మ దేవస్థానం చైర్మన్ చుంచు రమేష్ బాబు. మరియు పాలక మండలి సభ్యులు మరియు మీడియా మిత్రుల పరిచయ వేదిక దేవస్థానం సత్రాల నందు కళ్యాణ మండపం లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సంబోధించిన విషయాలు 1.నూతనంగా ఏర్పడిన పాలకమండలి ఎక్కువ తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల నుండి వచ్చు భక్తులు ఏ ఇబ్బందులు పడకుండా ఆత్మీయ వాతావరణం లో శ్రీ అమ్మవారి మరియు పరిసర సహ దేవతల దర్శించుకోను విధానం ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకున్నాము, 2.దాతల సహకారంతో శ్రీ అమ్మవారి దేవస్థానంలోని వెండి మకర తోరణాలు ఇత్తడి మరియు వెండి వాకిలు దాతలు సహకారాలతో మెరుగు పట్టించటం జరుగుతుంది.. 3.శ్రీ అమ్మవారి దేవస్థానం నందు శ్రావణమాసం నాలుగు శుక్రవారం సామూహిక 2౦౦0 మందితో. దాతలు మరియు ఆలయ సిబ్బంది సహకారాలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం సుమారు 2000 మందితో నిర్వహించటం జరిగింది. 4.శ్రీ అమ్మవారి గోశాలలో దాతలు నుండి వరిగడ్డి ఉచిత సేకరణ సేకరించడమైనది మరియు గోశాల లోని గోవుల నీటి కోసం అవసరమైన బోరు వేయడం జరిగింది. గోవులకు సౌకర్యం గోవులు రుద్దుకునే బండలు వేయటం జరిగింది గోశాలలో గోవులు గోకుల సౌకర్యం కోసం కొబ్బరి మ్యాట్లు వేయించడం జరిగింది. దేవస్థానం సత్రాలు భక్తులు సౌకర్య నిమిత్తము దేవస్థానం వారే నిర్వహించడం జరుగుతుంది. 5.అమ్మవారి దేవస్థానమునకు దాతలు సహకారంతో దేవస్థానము సంయుక్త రంగులు వేయించడం కార్యక్రమం సుమారు 80 లక్షల రూపాయలఖర్చు తో పని చేయటం పై చర్యలు చేపతాము. 6.అమ్మవారి దేవస్థానం నందు రాత్రివేళ వివాహం చేసుకోను భక్తులు వారి సౌకర్యార్థం దేవస్థానం నందు మేడా మండపంలో వివాహం చేసుకొనుటకు సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగింది. 7.అమ్మవారి దేవస్థానంలో ఉప ఆలయ సి ప్రతిష్టక అంకమ్మ అమ్మవారికి ఆలయం పై వెండి తపన ఏర్పాటు చేయటం తగు చర్యలు తీసుకోవడం ప్రణాళిక ఏర్పాటు చేశాము . 8.అమ్మవారి దర్శనార్థం విచ్చేసి భక్తులు ప్రధాన దేవత మూర్తులకు. ఎక్కువ సమయం దర్శనం చేసుకొనుటకు ప్రస్తుతము తాత్కాలికంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ ని దాతల సహకారంతో శాశ్వత క్యూలైన్ ఏర్పాటు చేయుట పై తగు చర్యలు చేయుట. 9.ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీ అమ్మవారి విశిష్ట విధంగా దాతల సహకారంతో 2027 క్యాలెండర్ భక్తులకు అందించటంపై తగు చర్యలు చేపట్టటం.. ఈ విషయాలు మీద శనివారం పాలక మండల చైర్మన్ చుంచు రమేష్ బాబుమరియు పాలక మండలి సభ్యులు విలేకరుల సమావేశంలో తెలిపారు,ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు. పాకాలపాట్టి. అనుసూర్య కల్లూరి శ్రీవాణి .కొలిపాక హైమావతి.పీ. జ్యోత్స్న ప్రియాంక.గుగులోతు .రమేష్ తన్నీరు గోపీనాథ్ శనగవరపు వెంకటేశ్వరరావు. గజ్జి పెద్ద ఆంజనేయులు ఓర్సు సూరమ్మ. కర్నాటి కవిత. మర్పనేని అప్పారావు. కాకులపాటి విజయలక్ష్మి. మర్రిబోయిన తిరుపతిరావు.. మరియు దేవస్థానం ఇన్స్పెక్టర్ బత్తుల కృష్ణ మోహన్, నవీన్, శశి కప్పుర్ మేడ రాము మరియు సిబ్బంది పాల్గొన్నారు...

# ప్రతి ఒక్కరికీ ప్రథమ చికిత్స నైపుణ్యాలు అవసరం

–రెడ్‌క్రాస్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. సమరం




**విజయవాడ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందేలోపు ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్సలో కనీస నైపుణ్యాలు కలిగి ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. సమరం అన్నారు. ప్రథమ చికిత్స కేవలం వైద్య సిబ్బందికి సంబంధించిన అంశం కాదని, ప్రతి పౌరుడికీ అవసరమైన ప్రాథమిక జీవన నైపుణ్యమని పేర్కొన్నారు. ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని వాసవ్య నర్సింగ్ హోమ్ సమావేశ మందిరంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సమరం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ రెండో శనివారం ప్రథమ చికిత్స దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, ప్రజల్లో ప్రథమ చికిత్సపై అవగాహన పెంచడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించే సామర్థ్యాన్ని పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ ఏడాది ప్రధానాంశమైన 'వలసదారులకు ప్రథమ చికిత్స మరింత కీలకం' గురించి ఆయన వివరిస్తూ ఉపాధి, విద్య, జీవనోపాధి, ప్రకృతి వైపరీత్యాలు, ఘర్షణలు, ఇతర సామాజిక–ఆర్థిక కారణాలతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే ప్రజలు అనేక ప్రమాదాలను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రయాణాల్లో రోడ్డు ప్రమాదాలు, గాయాలు, కాలిన గాయాలు, నీటి కొరత, ఎండదెబ్బ, అలసట, అనారోగ్యం వంటి అత్యవసర పరిస్థితులు ఎదురుకావచ్చన్నారు. కొత్త ప్రాంతాల్లో భాషాపరమైన ఇబ్బందులు, వైద్య సహాయం అందడంలో ఆలస్యం కూడా సమస్యగా మారవచ్చని చెప్పారు. ఇలాంటి సందర్భాల్లో సమీపంలో ఉన్నవారు సరైన ప్రథమ చికిత్స అందిస్తే బాధితుడి పరిస్థితి విషమించకుండా చూడటంతో పాటు వైద్య సహాయం అందే వరకు ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. ప్రథమ చికిత్స మానవతా సేవలో తొలి అడుగు అని పేర్కొన్నారు. రక్తస్రావాన్ని నియంత్రించడం, గాయాలకు తాత్కాలిక రక్షణ కల్పించడం, అపస్మారక స్థితిలో ఉన్న వారికి సురక్షితంగా సహాయం చేయడం, కాలిన గాయాల సమయంలో సరైన ప్రాథమిక చర్యలు తీసుకోవడం, అత్యవసర వైద్య సేవలకు సమాచారం అందించడం వంటి అంశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అయితే ప్రథమ చికిత్స వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని డాక్టర్ సమరం స్పష్టం చేశారు. పరిస్థితి తీవ్రంగా ఉంటే వెంటనే నిపుణులైన వైద్యులను లేదా అత్యవసర వైద్య సేవలను సంప్రదించాలన్నారు. తెలియని పద్ధతుల్లో చికిత్స చేయకుండా, శిక్షణ పొందిన విధానాలను మాత్రమే అనుసరించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే ప్రథమ చికిత్స, రక్తదానం, నేత్రదానం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ఆరోగ్య అవగాహన వంటి మానవతా సేవలపై ఆసక్తి పెంపొందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత అత్యవసర పరిస్థితుల్లో సమ–ర్థంగా స్పందించేలా నిరంతర శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు రెడ్‌క్రాస్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా యువ రెడ్‌క్రాస్ సమన్వయకర్త డాక్టర్ కె. రమేష్, యువ రెడ్‌క్రాస్ కార్యక్రమ అధికారి డి. రవికుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు, వైద్య, నర్సింగ్ రంగాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు మేలు చేస్తున్న న్యాయ విజ్ఞాన సదస్సులు




**సింగరాయకొండ,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కౌతరపు నటరాజ్ కుమార్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు జరిగినది , ఈ కార్యక్రమం లో గౌరవ అతిధి గా వైస్ ప్రిన్సిపాల్ ఆళ్ళ హరిబాబు, ముఖ్య అతిథి గా రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుంకర సాయిబాబు,గ్రామ పెద్దలు బైరెడ్డి మురళి లు పాల్గొన్నారు. ఈ సదస్సులో న్యాయ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు లోక్ అదాలత్ – ఆర్. నితిన్ రాజ్, బాలల న్యాయ చట్టం – కె. విజయ కుమారి, భరణం – ఎస్. హర్షిణి, మహిళల ఆస్థి హక్కులు – ఆయేషా, ఎఫ్ ఐ ఆర్ నిందితుల హక్కులు – కోట శ్రీనివాసరావు, సమాచార హక్కు చట్టం – నాగమణి, అసైన్డ్ భూముల బదలా యింపు నిషేధ చట్టం – బొట్లా రామారావు, మోటార్ వాహన చట్టం – యు. నవీన, బాల్య వివాహ నిషేధ చట్టం – కె. లిఖిత కృష్ణ, వరకట్న నిషేధ చట్టం – ఎన్. మౌనిక, తీర ప్రాంత నియంత్రణాధికార చట్టం వై. బ్రహ్మ తేజ, బెయిల్ – నాగ జ్యోతి, గృహ హింస నుండి మహిళల రక్షణ చట్టం – కె. మేఘన లు పై అంశాల పట్ల గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు నూతలపాటి శ్రీనివాసరావు, శర్వాణి, హేమలత, శర్వాణి, మక్కెన శ్రీనివాస్, రవిచంద్ర, అధ్యాపకేతర సిబ్బంది సుబ్బారావు, రామ్మోహన్, హనుమంతరావుకళాశాల విద్యార్థినీ విద్యార్థులు, ఊళ్ల పాలెం గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వినాయక చవితి పండగను శాంతియుతంగా నిర్వహించాలి

● ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగడానికి వీలులేదు ● ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి ● ఊరేగింపు సమయంలో కేవలం ఆధ్యాత్మిక పాటలు, భక్తి గీతాలు మాత్రమే పెట్టాలి ● అశ్లీల సాహిత్యం,హిజ్రాలతో డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు వంటివి వాటికి తావులేదు ● మద్యం సేవించి నృత్యాలు చేయడం, మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనడం నిషేధం ● -వినాయక చవితి పండగ కమిటీల ఆర్గనైజర్లతో ● ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎస్ఐ లు సతీష్ కుమార్,గిరిజామణి





**జి.కొండూరు,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** వినాయక చవితి పండగను శాంతియుతంగా,భక్తి భావంతో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించాలని స్థానిక ఎస్ ఐ లు కె. సతీష్ కుమార్, ఆర్.గిరిజామణి పేర్కొన్నారు.ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.వి. రాజశేఖర్ బాబు(ఐపీఎస్) ఆదేశాల మేరకు, రూరల్ డిసిపి లక్ష్మీనారాయణ (ఐపీఎస్) మార్గదర్శకత్వంలో, మైలవరం ఇన్‌ఛార్జి ఏసీపీ పి.రామచంద్రరావు నేతృత్వంలో, మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ బాబు కొత్తూరు పర్యవేక్షణలో జి.కొండూ రు పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక చవితి పండగ కమిటీల ఆర్గనైజర్లతో పండగ శాంతియుత నిర్వహణ, భద్రతా జాగ్రత్తలపై ఎస్ఐ లు సతీష్ కుమార్,గిరిజామణి జి కొండూరు మండల ప్రజా పరిషత్తు కమ్యూనిటీ హాలులో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశా నికి సుమారు 120 మంది కమిటీ సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జి.కొండూరు ఎస్సైలు సతీష్ కుమార్,ఆర్. గిరిజామణి కమిటీ ఆర్గనైజర్లకు కొన్ని సూచన లు సలహాలు ఇచ్చారు.

**ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదు :** రాబోవు వినాయక చవితి పండగను శాంతియుతంగా, భక్తి భావంతో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి పండగ కమిటీ తప్పనిసరిగా జి.కొండూరు పోలీస్ స్టేషన్‌లో ముందుగా అనుమతి తీసుకోవాలని, కమిటీ సభ్యుల పూర్తి వివరాలు, మండప స్థలం, నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశం ముందుగానే తెలియజేయాలని సూచించారు.

**మండపం వద్ద అగ్నిమాపక సాధనాలు తప్పనిసరి:** మండపం వద్ద తప్పనిసరిగా అగ్నిమాపక సాధనాలు, ఇసుక బకెట్లు, నీటి బకెట్లు అందు బాటులో ఉంచాలని, అగరుబత్తీలు, దీపాలు, కర్పూరం వినియోగించే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.విద్యుత్ భద్రత (Electrical Safety) గురించి వివరిస్తూ, మండపానికి అధీకృత ఎలక్ట్రీషియన్‌తోనే విద్యుత్ కనెక్షన్‌లు వేయించాలని, నాణ్యమైన వైర్లు వాడాలని, ఎర్త్ కనెక్షన్, వీజదీ తప్పనిసరి గా ఏర్పాటు చేయాలని సూచించారు.

**మండపం వద్ద 24 గంటలూ కనీసం ఇద్దరు కమిటీ సభ్యులు కాపలాగా ఉండాలి :** మండపం వద్ద 24 గంటలూ కనీసం ఇద్దరు కమిటీ సభ్యులు తప్పనిసరిగా కాపలాగా ఉండాలని,రాత్రి సమయంలో కూడా మండపాన్ని ఖాళీగా వదిలిపెట్టరాదని స్పష్టం చేశారు.అలాగే ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మండపం లోపల, బయట, ప్రవేశ ద్వారం వద్ద కెమెరాలు అమర్చాలని, రికార్డింగ్ కనీసం 15 రోజుల పాటు నిల్వ ఉండేలా చూడాలని కోరారు.

**మతపరమైన సామరస్యాన్ని కాపాడాలి :** ఇతర పండగ కమిటీలతో,ఇతర మతాల వారితో, వ్యక్తులతో ఎటువంటి పంతాలు, వ్యక్తిగత ఇగోలు, భేదాభిప్రాయాలు, ఘర్షణలకు తావు ఇవ్వరాదని,మతపరమైన సామరస్యాన్ని కాపాడాలని సూచించారు.ఇతర మతస్థుల భావాలను గౌరవించాలని ఎస్సైలు హెచ్చరించా రు.భక్తి భావంతో, భగవంతుని సేవలో పవిత్రంగా, ఆచార బద్ధంగా, నిష్ఠతో భక్తులుగా, సేవకులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

**అశ్లీల సాహిత్యం,హిజ్రాలతో డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు వంటివి వాటికి తావులేదు:** ఊరేగింపు సమయంలో కేవలం ఆధ్యాత్మిక పాటలు,భక్తి గీతాలు మాత్రమే పెట్టాలని,సినిమా పాటలు, అశ్లీల సాహిత్యం, డబుల్ మీనింగ్ పాటలు, హిజ్రాలతో డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించరాదని స్పష్టంచేశారు.మద్యం సేవించి నృత్యాలు చేయడం,మద్యం సేవించి ఊరేగింపు లో పాల్గొనడం వంటి విష సంస్కృతికి పూర్తిగా స్వస్తి చెప్పాలని సూచించారు.పండగ యొక్క పవిత్రతను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్లు వాడరాదని, సౌండ్ లిమిట్‌లు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ముఖ్యంగా డీజే లకు ఎటువంటి అనుమతి లేదని తెలియజేశారు.

**నిమజ్జనం సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి :** నిమజ్జనం సమయంలో విద్యుత్ వైర్లు, హైటెన్షన్ లైన్‌ల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఎత్తైన విగ్రహాలు తీసుకువెళ్ళే సమయంలో వైర్‌లకు తగలకుండా చూడాలని సూచించారు.వాహనాలు నెమ్మదిగా, జాగ్రత్తగా నడపాలని, అతివేగం చేయరాదని హెచ్చరించారు.నిమజ్జనం చేసే కాలువలు, చెరువుల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు, ఈత రాని వారు నీటికి దగ్గరగా వెళ్ళకుండా చూడాలని, ఈత వచ్చిన వ్యక్తులను ముందుగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్, డెకరేషన్ వస్తువులను నీటిలో వదలరాదని కోరారు.ఏదైనా చిన్న గొడవ జరిగినా, అనుమానాస్పద సంఘటన గమనించినా వెంటనే జి.కొండూరు పోలీసులకు తెలియజేయాలని, డయల్ 112 కు, అగ్నిమాపక సేవలు 101 కు, అంబులెన్స్ 108 కు, లేదా ఎస్సై నంబర్ 94407 96448 కు సంప్రదించాలని తెలిపారు. జి.కొండూరు పోలీసు యంత్రాంగం పండగ నిర్వహణలో పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో పోలీస్ సిబ్బందితో పాటు జి.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ వినాయక చవితి పండగ కమిటీల ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

# ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగాలి... ఎస్సై పై డి బాబు



**కృత్తివెన్ను,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** కృష్ణ జిల్లా ఎస్పీ వి.విద్యసాగర్ నాయుడు ఆదేశాల మేరకు కృతివెన్ను ఎస్ ఐ పైడిబాబు శనివారం కృత్తివెన్ను మండలంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన గణేష్ మండపాల ను పరిశీలించి ముఖ్యంగా విద్యుత్ కు సంబంధించిన తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కమిటీ వారు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకోవాలని డీజే ల తో కాకుండా సాంప్రదాయంగా డప్పులతో ఊరేగించుకోవాలని భక్తిశ్రద్ధలతో పండగ వాతావరణం లో పండగ జరుపుకోవాలని తెలియజేసినారు.

# గణేష్ మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు.. బంటుమిల్లి ఎస్ఐ నాగరాజు..



**కృతివెన్ను,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతుల కోసం ఏపీ పోలీస్ శాఖ ప్రత్యేకంగా గణేషటసావ్ నెట్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చిందని శనివారం బంటుమిల్లి ఎస్సై నాగరాజు తెలిపారు. బంటుమిల్లి మండల పరిధిలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారు ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. అనుమతుల కోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం పోలీసులు మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తారని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న మండపాలకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ఎ న్ ఓ సి జారీ చేస్తారని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై కోరారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం : కొప్పినీడి సూర్యప్రకాష్



**కృత్తివెన్ను,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వై హెచ్ ఏ ఐ )మరియు వాకర్స్ ఇంటర్నేషనల్ వారి సౌజన్యంతో శనివారం భీమవరంలో 600 మట్టి వినాయక విగ్రహాల ను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ మాట్లాడుతూ" మట్టి వినాయకులనే పూజిద్దాం అని పర్యావరణాన్ని కాపాడుదాం" అని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఇతర ప్లాస్టిక్ పదార్థాలతో తయారుచేసిన విగ్రహాల వల్ల పర్యావరణం కాలుష్యం అవుతుందని కావున ప్రజలందరూ మట్టితో తయారుచేసిన విగ్రహాలతో వినాయక చవితి ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వై హెచ్ ఎ ఐ వైస్ ప్రెసిడెంట్ బోనం పాండురంగారావు మాట్లాడుతూ పట్టణంలోని సుమారు 600 మందికి మట్టి వినాయకులను పంపిణీ చేయడం జరిగిందని ప్రతి సంవత్సరం కూడా ఆనవాయితీగా ఈ పంపిణీ చేస్తున్నామని ప్రజలంతా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరిపి డుకల రామారావు,ఆరేటి సత్యనారాయణ,వడుపు గోపి, భీమాల శ్రీరామ్ మూర్తి, కటికిరెడ్డి వెంకటరత్నం, జానపాటి మధుసూదన్ రావు, బోండా శ్రీరామ్, శ్రీఖాకొల్లు హనుమంతరావు మొదలగు వారు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం

● బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్



**హైదరాబాద్,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ) :** గచ్చిబౌలి డివిజన్, నల్లగండ్ల, నేతాజీ నగర్ కాలనీలో మట్టి వినాయకులు కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్, జిహెచ్ఎంసి అధికారులు ఆనంద్ డిఈఈ, సూపర్వైజర్ భరత్, రాందాస్ సూపర్వైజర్, వారి సహకారంతో మట్టి వినాయకులు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం... జై బోలో గణేష్ మహరాజ్ కీ జై అంటూ భేరి అందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, ఎన్ ఎన్ రెడ్డి బోటిక్ టెక్స్టైల్స్ ప్రొప్రైటర్ కుషన్ రెడ్డి, బీసీ కులాల ఐక్యవేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిపురం హరికృష్ణ చారి, శేరిలింగంపల్లి ముదిరాజ్ సంఘం ఇన్చార్జ్ కొత్త మనోజ్, మార్వాడి శంకర్, నరేష్, సురేష్ నాయక్, రంగస్వామి, బేరి చంద్రశేఖర్ యాదవ్, కృష్ణ గౌడ్, అశోక్, మరియు కాలనీ పెద్దలు యువజన నాయకులు పాల్గొన్నారు

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188